ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శుక్రవారం 30 ఆగస్టు 2024





బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు





జేఎన్‌టీయూ.. జాప్యం

జేఎన్‌టీయూ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ. ఇలాంటి సంస్థలో సీటు కోసం విద్యార్థులు పోటీ పడతారు. కానీ నరసరావుపేట సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ కాకినాడ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు విముఖత చూపుతున్నారు. ఎనిమిదేళ్లుగా కళాశాలలో భవన నిర్మాణాలు ఒక కొలిక్కిరాలేదు. అధ్యాపక నియామకాల్లోనూ జాప్యం చోటుచేసుకుంటుంది. మొత్తంమీద అటు వసతి.. ఇటు బోధన సక్రమంగా సాగక అడ్మిషన్లు పొందిన విద్యార్థులు అల్లాడుతున్నారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు జేఎన్‌టీయూ కేకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈ కళాశాలను పట్టించుకోలేదు. ఇదే రీతిలో వర్సిటీ పాలకులు కూడా నిర్లక్ష్యం వహిస్తూ వచ్చారు. దీంతో ప్రస్తుతం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సమస్యల సుడిగుండలో చిక్కుకుంది. గతంలో కళాశాల ఇక్కడ నెలకొల్పేందుకు కృషి చేసి శంకుస్థాపన చేసిన చంద్రబాబు తిరిగి శుక్రవారం ముఖ్యమంత్రి హోదాలో కళాశాలకు రానున్నారు. దీంతో కళాశాల భవితపై చంద్రబాబు దృష్టి సారిస్తారని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సా...గుతున్న కళాశాల భవన నిర్మాణాలు. పూర్తికాని భవనాల్లో తరగతులు. 73 మంది అధ్యాపకుల కొరత.. ఇదీ నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల పరిస్థితి. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ సమస్యల సుడిగుండలో చిక్కుకుంది. నరసరావుపేటకు సమీపంలో జేఎన్‌టీయూ కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలను 2016లో ఏర్పాటు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కళాశాలకు శంకుస్థాపన చేశారు. కళాశాల భవనాల నిర్మాణానికి జేఎన్‌టీయూ కాకినాడ రూ.90 కోట్లు మంజూరు చేయగా రూ.28 కోట్లతో పరిపాలన, ప్రయోగశాలలు, తరగతి గదుల నిర్మాణాలను చేపట్టారు. ఐదేళ్లుగా కళాశాల భవన నిర్మాణ పనులు సాగదీస్తున్నారు. తరగతులు నిర్వహించేందుకు వీలుగా మాత్రమే పనులు పూర్తి చేశారు. రూ.62 కోట్లతో చేపట్టిన వసతి గృహాల నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తికి నోచుకోలేదు. కళాశాల భవనాలు, వసతి గృహాల నిర్మాణాలు పూర్తికాక పోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కళాశాలలో ఐదు బ్రాంచ్‌లు ఉండగా వెయ్యి మందికిపైగా విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఆ స్థాయిలో సౌకర్యాలు, వసతులు, బోధన జరగడంలేదు. పూర్తికాని భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రాంగణంలో వసతి గృహాలు లేక వసతికి విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

అధ్యాపకుల కొరతతో బోధన సక్రమంగా జరగకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళాశాల తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

అతిథి అధ్యాపకులే దిక్కు

ఇంజనీరంగ్ కళాశాల నిర్వహణపై కాకినాడ జేఎన్‌టీ యూనివర్సిటీ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. కళాశాలను నిర్వీర్యం చేసేలా వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా అధ్యాపకులను నియమించడంలేదన్న విమర్శలున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో వర్సిటీ ఘోరంగా విఫలమవుతోంది. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వం కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసి రూ.7.11 కోట్లు వార్షిక బడ్జెట్‌ను కేటాయించింది. అయితే వైసీపీ పాలకులు అధ్యాపకులను నియమించడాన్ని విస్మరించారు. పర్మినెంట్ అధ్యాపకులు ఏడుగురు మాత్రమే కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నది ఒకే ఒక ప్రొఫెసర్ కాగా అది కూడా ప్రిన్సిపాలే. అసోసియేట్ ప్రొఫెసర్లు కేవలం ఇద్దరే ఉండగా ఒకరు క్రీడలకు కేటాయించారు. కనీసం అధ్యాపకులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించే విషయంలోనూ వర్సిటీ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

ఉద్యోగాలను కోల్పోతున్న విద్యార్థులు

అధ్యాపకుల కొరత వెంటాడుతుండటంతో ప్రతిభ కలిగిన విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోంది. అధ్యాపకులు లేకపోవడంతో ఇక్కడ విద్యార్థులు చేరేందుకు ఇష్టపడటంలేదు. దీంతో సీట్లు మిగిలిపోతున్నాయి. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడాల్సిన కళాశాలను వర్సిటీ నిరుపయోగంగా మార్చేస్తోందన్న విమర్శలున్నాయి. ఏటా ఉద్యోగాలు పొందే విద్యార్థుల సంఖ్య పెరగాల్సి ఉండగా ఈ కళాశాలలో దారుణంగా పడిపోతుంది. అయినా అటు ప్రభుత్వం కానీ ఇటు వర్సిటీ పాలకవర్గం కానీ పట్టించు కోవడంలేదు.

చంద్రబాబుపైనే విద్యార్థుల ఆశలు

జేఎన్‌టీయూ కాకినాడ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థ. ఈ కళాశాల తమ ప్రాంతంలో ఉండాలని ప్రజల ఆశ. ఈ విద్యా సంస్థలో చదువుకోవాలనేది విద్యార్థుల కల. అలాంటి విద్యా సంస్థను ఉమ్మడి గుంటూరు జిల్లాకు తీసుకువచ్చిన ఘనత నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుది. కాగా నరసరావుపేటలో ఏర్పాటు చేసేలా నాటి అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు చేశారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కళాశాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వైసీపీ హయాంలో కళాశాల నిర్లక్ష్యానికి గురైంది. దీంతో ఎనిమిదేళ్లుగా కళాశాలలో నిర్మాణాల నుంచి అధ్యాపకుల నియామకాల వరకూ జాప్యమే. విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలోనూ నష్టపోతున్నారు. ఈ దశలో శుక్రవారం కళాశాల ప్రాంగణంలో జరిగే వనమహోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొనేందుకు రానున్నారు. వీరి పర్యటనతో అయినా కళాశాల దశ మారుతుందని విద్యార్థులు భావిస్తున్నారు. నిర్మాణాల్లో జాప్యాన్ని నివారించి అధ్యాపకులను నియమిస్తారని.. కనీస వసతులు కల్పిస్తారని సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ స్పందించి ప్రకటన చేస్తారని విద్యార్థులు.. వారి తల్లిదండ్రులు ఎంతో ఆశతో ఉన్నారు. వీరి పర్యటనతో కళాశాల సమస్యలు పరిష్కారమైతే విద్యార్థులకు మేలు జరుగుతుందని చెప్పవచ్చు.

ఖాళీల వివరాలు ఇలా..

క్యాడర్	ఉండాల్సిన వారు	ఉన్నవారు	ఖాళీ
ప్రొఫెసర్	8	1	7
అసోసియేట్లు	18	2	16
అసిస్టెంట్లు	53	4	49

ప్రాంగణ ఎంపికలు ఇలా..

సంవత్సరం	ఎంపికైన విద్యార్థులు
2021	180
2022	150
2023	110
2024	72



నిర్మాణంలో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్



బాలికల వసతి గృహం



బాలుర వసతి గృహం

నేడు.. చంద్రబాబు, పవన్ రాక

● నరసరావుపేట జేఎన్‌టీయూలో వనమహోత్సవం
● మొక్కలు నాటనున్న సీఎం, డిప్యూటీ సీఎం.. భారీగా పోలీసు బందోబస్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌కుమార్, జేసీ సూరజ్, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా టీడీపీ, జనసేన అధినేతలైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌లు ఒకే వేదికపైకి రానున్నారు. నరసరావుపేట మండలం కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ సీఎంల హోదాలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు పాల్గొననున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వేర్వేరుగా రెండు హెలికాప్టర్లలో జేఎన్‌టీయూకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. చంద్రబాబు, పవన్ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభిస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభలో వారు ప్రసంగించనున్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు సభకు హాజరుకానున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ సూరజ్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు పరిశీలించారు. సభకు హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని వారు అధికారులను ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లపై ఎస్పీ సమీక్షించారు.

ఆర్భాటాలకు దూరంగా సభ

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హంగు, ఆర్భాటాలు లేకుండా సభకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. ఐదారు వేల లోపు స్థానిక ప్రజానీకం మధ్య వన మహోత్సవం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారన్నారు. భద్రత విషయంలో మాత్రం రాజీ లేదన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

కార్యక్రమం ఇలా..

- ఉదయం 10.10 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబు బయలుదేరుతారు.
- 9.30 గంటలకు మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి పవన్‌కల్యాణ్ హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. జెఎన్‌టీయూ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.15గంటలకు పవన్, 10.30గంటలకు చంద్రబాబు జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు వస్తారు.
- 10.45 గంటలకు కళాశాల ప్రాంగణంలో ఇద్దరూ కలిసి మొక్కలు నాటుతారు.
- అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- 12.45 గంలకు బహిరంగ సభ ముగుస్తుంది.
- 12.50గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని బయలుదేరి వెళ్తారు.



జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్

మళ్లీ సాగర్ గేట్లెత్తారు

● 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
● దిగువుకు 3.07 లక్షల క్యూసెక్కులు విడుదల



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

వీపీ సౌత్, మాచర్ల రూరల్/నరసరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పరవళ్ల తొక్కుతున్న కృష్ణమ్మ సాగర్ బంధనాలను తెంచుకుంది. ఈ సీజన్‌లో రెండో సారి నాగార్జున సాగర్ గేట్లు మొత్తం ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. నాగార్జున సాగర్‌కు ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో సాగర్ జలాశయం క్రస్ట్ గేట్లన్నీ మళ్లీ తెరుచుకున్నాయ్. జలాశయం 26 గేట్లు ఎత్తి నీటిని గురువారం విడుదల చేశారు. ఈ నెలలో గేట్లన్నీ తెరుచుకోవడం ఇది రెండో సారి. క్రస్ట్ గేట్ల నుంచి పాల నురగలా జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను తనివితీరా చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. డ్యాంకు వస్తున్న నీటిని వస్తున్నట్టుగా దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌లో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకోవడంతో 26 క్రస్ట్ గేట్లలో 12 గేట్లను 5 అడుగులు, 14 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,07,382 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పూర్తి స్థాయి సామర్థ్యం 312.05 టీఎంసీలకు 312.04 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కుడి కాల్వ ద్వారా 9387, ఎడమ కాల్వ ద్వారా 8280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,745 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 3,07,382, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600 మొత్తం ఔట్‌ఫ్లో 3,56,194 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,56,194 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు పోటెత్తుతున్న వరద

సాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. భారీగా వరద వస్తుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి ప్రకాశం బ్యారేజ్‌కు 2,71,983 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతలకు 1,64,573 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఈ ప్రవాహం శుక్రవారానికి మూడులక్షల క్యూసెక్కులకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పులిచింతల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా 42.57 టీఎంసీల నిల్వ ఉంది.

ఎస్ఎస్ఆర్ సక్రమంగా పూర్తి చేయాలి

● అక్టోబరు 29 ఓటర్ల జాబితా ప్రచురణకు చర్యలు
● అధికారులను ఆదేశించిన కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్ఎస్ఆర్-2025కు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రక్రియలను సక్రమంగా పూర్తిచేసి సమీకృత ముసాయిదా ఓటర్ల జాబితాను అక్టోబరు 29తేదీ నాటికి ప్రచురించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆమె సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్‌తేజ, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్‌పవార్ జగన్నాథ్, డీఆర్వో పెద్దిరోజాతో కలిసి ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్వోలు ఓటరు కార్డుల ఇంటింటి పరిశీలన ప్రక్రియ సెప్టెంబరు 20 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి పరిశీలనలో గుర్తించిన ఓటరు కార్డులో సవరణలు, మరణించినా, శాశ్వతంగా వేరే ప్రదేశానికి వెళ్లిపోయినవారి ఓట్లు తదితర అంశాలను పరిష్కరించి అక్టోబరు 18కి అప్‌లోడింగ్ చేయాలన్నారు. ఇప్పటికీ ఇంటింటికి ఓటరుకార్డుల పరిశీలన ప్రారంభించని బీఎల్వోలకు నోటీసులు జారీచేయాలన్నారు. ఒకే ఇంటిలోను, గృహసముదాయాలలో నివసిస్తున్న వారి ఓట్లు ఒకే పోలింగ్‌బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు, ఏఈఆర్వోలు, ఈఆర్వోలు ఎన్నికలసంఘం నిర్దేశించిన ప్రకారం బీఎల్వోలు పరిశీలన చేసిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, శివపార్వతి, నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, తహసీల్దార్లు సుభాని, నగేష్, వెంకటస్వామి, శర్మ, సిద్ధార్థ, గోపాలకృష్ణ, రవికుమార్, సతీష్, కృష్ణకాంత్, సునీత, నాసరయ్య, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ జాబితాల రూపకల్పనపై జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

● ముగిసిన ఆన్‌లైన్ ఆప్షన్స్ ప్రక్రియ
● బదిలీల ఉత్తర్వులు రేపు విడుదల

విద్యుత్‌శాఖలో బదిలీల కసరత్తు

గుంటూరు, ఆగస్టు 29: ఏపీసీపీడీసీఎల్ పరిధిలో గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్‌లో ఉద్యోగుల బదిలీల కోలాహలం నెలకొంది. ఇప్పటికే బదిలీల మార్గదర్శకాలు విడుదలతో ఆ మేరకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. బదిలీలకు సంబంధించి మూడు స్టేషన్‌లు ఎంపిక చేసుకునేలా ఉద్యోగులకు ఇచ్చిన ఆన్‌లైన్ ఆప్షన్స్ ఎంపిక గడువు గురువారం సాయంత్రంతో ముగిసింది. దీంతో గుంటూరు సర్కిల్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణయాదవ్, సీఆర్‌డీఏ సర్కిల్ ఎస్ఈ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్‌లు బదిలీల జాబితా రూపకల్పన లో నిమగ్నమయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు సర్కిల్స్ ఉండగా.. గుంటూరుసర్కిల్ పరిధిలో గుంటూరు-1, తెనాలి, నరసరావుపేట, మాచర్ల, బాపట్ల డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. సీఆర్‌డీఏ సర్కిల్ పరిధిలో గుంటూరు-2, అమరావతి డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లోని అర్హులైన క్లరికల్ సిబ్బందితో పాటు ఆపరేషన్ (ఓఅండ్ ఎమ్) విభాగంలో లైన్‌మెన్‌లు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బంది బదిలీ కానున్నారు. మరో వైపు ఇంజనీరింగ్ అధికారులు కూడా బదిలీ కానున్నారు. ఇక ఉద్యోగ సంఘాల సభ్యులకు మాత్రం ఎనిమిదేళ్ల లోపు వారికి బదిలీల నుంచి మినహాయింపు కల్పించారు. శనివారం సాయంత్రానికి బదిలీల ప్రక్రియ పూర్తిచేసి ఉత్తర్వులు జారీచేయనున్నారు. తాము కోరుకున్న స్టేషన్‌లో బదిలీకోసం ఉన్నతాధికారులపై అధికార టీడీపీ నేతల నుంచి ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అనేక మంది ఉద్యోగులు అధికార పార్టీ నేతల నుంచి సిఫార్సు లేఖలు తీసుకొచ్చారు. కీలక స్థానాలకు పోటీ ఎక్కువగా ఉండటంతో పాటు సిఫార్సు లేఖలు అధికా రులకు తలనొప్పిగా మారాయి.

వైసీపీతో అంటకాగిన వారికే సిఫార్సు

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో అంట కాగిన వారికే తిరిగి తాజాగా పోస్టింగ్స్ ఇవ్వాలంటూ కూటమి ప్రజా ప్రతినిధులు సిఫార్సు చేయడం విద్యుత్ శాఖ వర్గాల్లోనే కాక టీడీపీ శ్రేణుల్లోనూ కలకలం, ఆందోళన వ్యక్తమవుతోంది. గుంటూరు పరిధిలో అత్యంత కీలకమైన పోస్టులు అన్నింటి లోనూ వైసీపీకి వీర విధేయులుగా పనిచేసిన వారే దర్జాగా తిష్ఠ వేయనున్నారనే సమాచారం ఆ శాఖ అధికారులు, ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గతంలో వైసీపీ నేతలతో అంట కాగిన ఓ అధికారికి ఈఈ పోస్టు ఇవ్వాలని పలువురు ఎమ్మెల్యేలతో పాటు ఓ ఎంపీ కూడా సిఫార్సు లేఖ ఇచ్చినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. అదే పోస్ట్ కోసం గత ప్రభుత్వంలో టీడీపీ ముద్ర వేసి ఇబ్బందులకు గురైన ఓ అధికారి చివరి వరకు ప్రయత్నించినా పని కాలేదు. గుంటూరులో ఉన్న నాలుగు ఏడీఈ పోస్ట్ ల్లోనూ వైసీపీ అనుయాయులకే కూటమి ప్రజా ప్రతినిధులు సిఫార్సు లేఖలు ఇవ్వడం ప్రస్తుతం విద్యుత్ శాఖలో కలకలం రేపుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు మంచి పోస్టింగ్స్ వస్తాయని భావించి, గత ప్రభుత్వంలో ఇబ్బందిపడిన అధికారులు, సిబ్బంది నిరాశలో ఉన్నారు.

డీఎల్ఎస్ఏలో మూడు నామినేటెడ్ పోస్టుల భర్తీ

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో మూడు నామినేటెడ్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. సోషల్ వర్కర్ పోస్టులో తాడేపల్లికి చెందిన లత నంబూరి, న్యాయ శాస్త్ర విభాగం నుంచి వట్టిచెరుకూరుకు చెందిన కాకుమాను రమేష్, లీగల్ సర్వీసెస్ స్కీంలో ఆసక్తి కలిగిన గుంటూరు ఎల్ఐసీ కాలనీకి చెందిన అనురాధ మల్లెలని నియమించింది. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

ముంబై నటి కేసులో సమగ్ర విచారణ చేయాలి

పొన్నూరుటౌన్, ఆగస్టు 29: ముంబైకి చెందిన నటి కేసులో సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గురువారం డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సలహాదారుడి పదవి వెలగపెట్టిన సకల శాఖ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డితో సహా ఐపీఎస్‌లు అందరూ కలిసి ఒక మహిళపై చేసిన సామూహిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ వ్యవహారం వెనుక ఎవరు ఉన్నారు అనే అంశాలపై నిజ నిర్ధారణ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలు ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని వీటిపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని ప్రభుత్వాని కోరారు.

టీడీపీలో చేరనున్న వైసీపీ కౌన్సిలర్లు

తెనాలి అర్బన్, ఆగస్టు 29: వైసీపీకి చెందిన పలువురు కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఇద్దరు కౌన్సిలర్లు గురువారం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గుంటూరులో ఆయన స్వగృహంలో కలిశారు. 25, 26 వార్డుల కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, షేక్ ఇస్మాయిల్ మాజీ మంత్రిని కలిసి పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. వారి బాటలోనే మరి కొందరు కౌన్సిలర్లు టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాదియాకు స్వర్ణ పతకం



స్వర్ణ పతకంతో సాదియా అల్‌మాస్

మంగళగిరి సిటీ, ఆగస్టు 29: మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా అల్‌మాస్ అంతర్జాతీయ వేదికపై మరోమారు సత్తా చాటింది. మాల్టా దేశంలో ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు జరుగుతున్న ప్రపంచ జూనియర్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా 57 కిలోల విభాగంలో సాదియా ఓవరాల్‌గా స్వర్ణ పతకం సాధించింది. స్క్వాట్‌లో 190 కిలోలు, బెంచిప్రెస్‌లో 97.5 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 175 కిలోలు కలిపి మొత్తం 462.5 కిలోల బరువును ఎత్తి ఈ ఘనతను సాధించినట్టు సాదియా తండ్రి, కోచ్ షేక్ సందాని తెలిపారు. అంతర్జాతీయ వేదికపై మంగళగిరి ఖ్యాతిని మరోమారు ఇనుమడింపజేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాగా మాల్టా దేశంలో జరుగుతున్న పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సహకారం అందించాలని సాదియా అల్‌మాస్ మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించగా, తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్ ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట రూ.3 లక్షల సాయాన్ని అదే రోజు అందజేశారు.

చేనేత సమస్యలపై మంత్రి సవితకు వినతి




మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఆగస్టు 29: రాష్ట్రంలో చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు గురువారం తాడేపల్లిలో ఏపీ చేనేత, జౌళి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. చేనేత సమస్యలను మంత్రి సవిత దృష్టికి తీసుకువెళ్లి, నేతన్న సాధకబాధకాలపై చర్చించారు. అనంతరం మంగళగిరిలోని అమరావతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్ మాట్లాడారు. చేనేత సమస్యలపై మంత్రితో చర్చించామని, బోగస్ చేనేత సహకార సంఘాల ప్రక్షాళనకు పూర్తిగా సహకరిస్తామని తెలియజేశామని చెప్పారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, ఎన్నికల ద్వారా ఆప్కో చైర్మన్ ఎన్నికను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. చేనేత జీఎస్టీకి రీఎంబర్స్‌మెంట్ అనేది సాంకేతికంగా ఇబ్బందికరమైందని, చేనేత జీఎస్టీకి ప్రత్యేక హెచ్ఎస్ఎన్ కోడ్ ఇవ్వాలని, చేనేతపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలని, చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. ఆయా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారని తెలిపారు. వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, వాసా పల్లపురాజు, కూరపాటి కోటేశ్వరరావు, పడవల మోహన త్రినాథ్, పిచ్చుక ఫణికుమార్, రామనాథం పరమేశ్వరరావు, గుర్రం చినవీరయ్య, తాళ్ల మోహనకృష్ణ పాల్గొన్నారు.

బదిలీల్లో జోక్యం ఉన్నట్లు నిరూపిస్తే రాజీనామా

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఆగస్టు 29: ఉద్యోగుల, అధికారుల బదిలీల్లో తన కుటుంబ సభ్యుల జోక్యం ఉన్నట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి, పార్టీకి కూడా రాజీనామా చేస్తానని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం తన స్వగృహంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన వలన పార్టీకి నష్టం జరగడానికి వీల్లేదనీ, ఎమ్మెల్యే పదవిపై కూడా మచ్చ పడటానికి వీల్లేదనీ, ఈ విషయంలో తాను చాలా స్పష్టంగా ఉన్నానని చెప్పారు. తన భార్య జన్మదిన వేడుకల్లో పోలీసులు పాల్గొనడం యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన అని చెప్పారు. ఆరోజు చిలకలూరిపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై సమీక్షించడానికి పోలీసులను పిలిచామని తెలిపారు. సీఐలు, ఎస్సైలు వచ్చినప్పుడు మండల పార్టీ నాయకులు కేక్ తీసుకొచ్చారని, ఆ సమయంలో పోలీసులు అక్కడ నిలబడటం యాదృచ్ఛికం తప్ప వారు కావాలని రాలేదని పేర్కొన్నారు. దానిని కూడా తాను సమర్థించడం లేదన్నారు. బదిలీల్లో జోక్యం చేసుకుంటున్నారని, అక్రమ వ్యాపారాలకు కొమ్ము కాస్తున్నారని వచ్చిన ఆరోపణలు బాధను కలిగించాయన్నారు. తన కుటుంబ సభ్యులు కొద్ది నెలలుగా హైదరాబాద్‌లోనే ఉంటున్నారని తెలిపారు. అక్కడ ఉంటున్నవారిపై ఇలా బురద చల్లడం సరికాదని అన్నారు. ఒక వివాహ వేడుకకు హాజరయ్యే నిమిత్తం తన భార్య హైదరాబాదు నుంచి చిలకలూరిపేటకు వచ్చినట్లు తెలిపారు. ఆ మరుసటి రోజే పుట్టినరోజు వచ్చిందని, పుట్టిన రోజు వేడుకలు చేసుకోవడానికి తమ కుటుంబ సభ్యులు ఎప్పుడూ ఇష్టపడరని అన్నారు.

మున్సిపల్ చైర్మన్ రఫాని టీడీపీలో చేరిక

చిలకలూరిపేట, ఆగస్టు 29: వైసీపీకి చెందిన చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని గురువారం టీడీపీలో చేరారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు టీడీపీ కండువా కప్పి ప్రత్తిపాటి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణ అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని పుల్లారావు ఇచ్చిన పిలుపుమేరకు తాను టీడీపీలో చేరినట్లు రఫాని ప్రకటించారు. వైసీపీ రాజకీయాలు నచ్చటం లేదని, ఓటమి నుంచి ఆ పార్టీ నాయకులు గుణపాఠం నేర్చుకోలేదని చెప్పారు. తప్పుడు ప్రచారాలతో రాజకీయం చేయటమే వారి ఎజెండాగా ఉందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు షేక్ కరీముల్లా, టీడీపీ కౌన్సిలర్ గ్రూపు నాయకుడు గంగా శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రఫానికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రత్తిపాటి

బోగస్ రుణాలపై చర్యలు ప్రారంభం

- సీఎంఎం మేరీ జ్యోత్స్న సస్పెన్షన్
- ఇద్దరు సీవోలు, ఒక ఆర్పీ కూడా సస్పెన్షన్

పొన్నూరుటౌన్, ఆగస్టు 29: బోగస్ గ్రూపులు, అక్రమ రుణాల పేరుతో పొన్నూరు పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో జరిగిన అవకతవకలపై మెప్మా మిషన్ డైరెక్టర్ స్పందిస్తూ ముగ్గురు అధికారులు, ఒక రిసోర్స్ పర్సన్‌ను సస్పెన్షన్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పొన్నూరు పురపాలక సంఘంలోని కమ్యూనిటీ మిషన్ మేనేజర్ ఎం.మేరీ జ్యోత్స్న, కమ్యూనిటీ ఆర్గనైజర్లు వి.ఉషారాణి, పి.జ్యోతి, రిసోర్స్ పర్సన్ నాగ సంధ్యలను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మెప్మా విభాగంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై పీడీ వెంకటేశ్వరరావు విచారణకు ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాలు రుణాలు పొందిన బ్యాంక్ నుంచి మరొక బ్యాంక్‌కు మారే వెసులుబాటుకల్పించారు. దీనిని పొన్నూరు పురపాలక సంఘంలోని మెప్మా అధికారులు వైసీపీ నాయకులతో కలిసి బోగస్ గ్రూపుల సృష్టికి అవకాశంగా మలుచుకున్నారు. బ్యాంకుల మధ్య సమన్వయం లేకపోవటంతో ఒక బ్యాంక్‌లో ఉన్న గ్రూపుతోనే మరొక బ్యాంక్‌లో కొత్త గ్రూప్ ఏర్పాటు చేసి బోగస్ రుణాలను పొందారు. ప్రాథమికంగా అందిన ఫిర్యాదుల మేరకు చైతన్య గోదావరి బ్యాంక్‌లోని వైఎస్ మహిళా పొదుపు సంఘం రూ. 10 లక్షలు, బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మదర్‌థెరిస్సా మహిళా పొదుపు సంఘం రూ. 10 లక్షలు, చైతన్య గోదావరి బ్యాంక్‌లో శాంతి మహిళా పొదుపు సంఘం రూ. 10 లక్షలు, దుర్గమ్మ మహిళా పొదుపు సంఘం రూ.7.50 లక్షలు, కెనరా బ్యాంక్‌లో తారా మహిళా పొదుపు సంఘం రూ. 8 లక్షలు రుణాలు పొందారు. ఈ గ్రూపులకు సంబంధించి సభ్యుల వివరాలు, ఆధార్ సీడింగ్‌ను మెప్మా పోర్టల్‌లో నమోదు చేయలేదు. అలాగే ఈ పొదుపు సంఘంలోని మహిళలు మరొక పొదుపు సంఘంలో కూడా సభ్యులుగా ఉండి వేరే బ్యాంక్‌లో రుణాలు పొందిఉన్నారు. సీఎంఎం కానీ, సీవోలు కానీ పొదుపు సంఘం బ్యాంక్ లింకేజ్ ఇచ్చినప్పుడు గ్రూపు వివరాలను, సంఘ కార్యకలాపాలను పుస్తక తీర్మానాలను పరిశీలించాలి. కానీ అధికారులు వీటిని పట్టించుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఈ ఐదు గ్రూపుల ద్వారా రూ. 45.50 లక్షలు ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు అధికారుల విచారణలో గుర్తించారు. ప్రాథమిక విచారణలో అవకతవకలు రుజువైనట్లు గుర్తించటంతో వారిని వారి విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ఆర్పీ నాగసంధ్య పేరును మెప్మా లాగిన్ నుంచి తొలగించాలని ఆదేశించారు. అయితే పొన్నూరు పురపాలక సంఘంలో పెద్ద సంఖ్యలో బోగస్ గ్రూపులు ఏర్పాటు చేసి అవినీతికి పాల్పడినట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. సమగ్ర విచారణ జరిపితే మరిన్ని అవకతవకలు బహిర్గతం అవుతాయని పొదుపు మహిళలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

డాక్టర్ కందిమళ్లకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం



ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు

చిలకలూరిపేట, ఆగస్టు 29: తెలుగు భాషా వికాసానికి నాటక ప్రక్రియ ద్వారా విశేష కృషి చేస్తున్న పట్టణానికి చెందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు తెలుగు భాషా పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ గురువారం ప్రదానం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభకు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షత వహించారు. ప్రముఖ నాటక రచయితగా, పరిశోధకునిగా గుర్తింపు పొందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు స్థానిక డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా, రీడర్ గా, ప్రొఫెసర్‌గా 39 ఏళ్లు పని చేశారు. కందిమళ్ల 17 నాటకాలు, నాటికలను రచించగా అవి పరిషత్తులలో వందలాది బహుమతులు పొందాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి తెలుగు నాటకరంగం నూతన ధోరణులు, ప్రయోగాలు అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందారు. బరంపురం విశ్వవిద్యాలయం నుంచి గుంటూరు జిల్లా నాటకరంగ చరిత్రపై పరిశోధన చేసి డీలిట్ పట్టాను పొందారు. భారతీయ నాటక రంగ చరిత్రలో ఈ పట్టాను పొందిన పరిశోధకుడు కందిమళ్ల ఒక్కరే. ప్రకాశం జిల్లా రైతు మాండలికంలో కందిమళ్ల రచించిన సైసై జోడెడ్లబండి నాటకం బంగారు నంది పురస్కారాన్ని పొందింది. తెలుగు నాటక రంగంపై 10 గ్రంథాలను రచించగా రెండు గ్రంథాలకు ఉత్తమ నాటక గ్రంథాలుగా నంది అవార్డులు లభించాయి. తెలుగు భాషా బోధన తో పాటు నాటక రచన పరిశోధన తో భాషా వికాసానికి కందిమళ్ల విశేష కృషి చేస్తున్నారు.

కార్యదర్శుల కౌన్సెలింగ్ పూర్తి

గుంటూరు సిటీ, ఆగస్టు 29: పంచాయతీల్లో పని చేస్తున్న కార్యదర్శులకు గురువారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, జడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు మూడు జిల్లాల నుంచి తరలివచ్చిన కార్యదర్శులకు కౌన్సెలింగ్ చేపట్టారు. గ్రేడ్ 5, 6లకు చెందిన 376 మంది కార్యదర్శులకు స్థాన చలనం అయినట్లు తెలిసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

సంస్థాగతంగా బీజేపీని మరింత బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న పురందేశ్వరి, పక్కన బీజేపీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 29: సంస్థాగతంగా బీజేపీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గురువారం లాలుపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కిసాన్ మోర్చా ఇన్చార్జి, జాతీయ కార్యవర్గ సభ్యుడు భారతీ మోహన్, కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.సురేష్‌రెడ్డితోపాటు ఆమె హాజరైయ్యారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ బీజేపీకి సానుకూల దృక్పథంతో ఉన్నారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అత్యధిక సంఖ్యలో ప్రజల నుంచి సభ్యత్వాలు చేర్పించాలన్నారు. వివిధ మోర్చాలు ప్రత్యేకించి కిసాన్ మోర్చా ద్వారా రైతులను పెద్ద ఎత్తున చేర్పించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రసాదు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సురేంద్రనాథ్ రెడ్డి, పాకాలపాటి రవిబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

55,261 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 56,735 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 55,261 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 22,347 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	17000	334	8000	15500
నెంబరు. 5	9000	13000	నెంబరు. 5	10000	14000
273	9000	13000	273	11900	12000
341	8000	16000	341	9000	16000
4884	9000	11600	4884	12000	16500
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18500	తేజ	7500	18500
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9000	13500
దేవనూరు డీలక్స్	9500	14700	దేవనూరు డీలక్స్	9500	15000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5000	11000

భార్యను హత మార్చిన భర్త అరెస్ట్

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 29: భార్యను క్రికెట్ బ్యాట్‌తో కొట్టి హతమార్చిన భర్తను అరెస్ట్ చేసినట్లు ఇన్చార్జి ఈస్ట్ జోన్ డీఎస్పీ బీవీ సుబ్బారావు గురువారం తెలిపారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన అచ్చి అంకమ్మరావు అలియాస్ అభిరామ్ 11 ఏళ్ల క్రితం గుంటూరు వచ్చి సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గుంటూరు టౌన్ మణిపురం ప్రాంతానికి చెందిన మాచవరపు చిన్న వెంకటేశ్వర్లు రెండో కుమార్తె మౌనికను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరి వైవాహి జీవితంలో ఇద్దరు పిల్లలు పుట్టారు. అంకమ్మరావు సెంట్రింగ్ పని చేస్తుండగా, అతని భార్య మౌనిక ఆటోనగర్‌లోని కంపెనీలో పని చేస్తుంది. వ్యసనాలకు బానిసైన అంకమ్మరావు భార్యపై అనుమానంతో ఆమె ఎక్కడ పని చేస్తే అక్కడికి వెళ్లి మగవాళ్లతో అక్రమ సంబంధం అంటగట్టి ఆమెను కొట్టి, తిట్టి, కులం పేరుతో దూషిస్తున్నాడు. ఈ క్రమంలో 26వ తేదీన మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. ఫ్రైడ్ రైస్ తెచ్చి ఆమెను తినమని బలవంతం చేసినా, ఆమె తినలేదు. దీంతో బూతులు తిట్టి ఆమెను గొంతు పట్టుకొని గోడకేసి కొట్టాడు. పక్కనే ఉన్న క్రికెట్ బ్యాట్ తీసుకుని తలపై కొట్టాడు. అనంతరం పారిపోయాడు. మౌనికను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. నిందితుడైన మృతురాలి భర్త అంకమ్మరావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు డీఎస్పీ సుబ్బారావు చెప్పారు. పాతగుంటూరు సీఐ వై.వి. సోమయ్య, ఎస్ఐ భాగ్యరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మంగళగిరి సిటీ, ఆగస్టు 29: ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళగిరిలో చోటుచేసుకుంది. రైల్వే సీఐ అంజిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మంగళగిరి రైల్వే స్టేషన్ దాటిన తరువాత కొద్ది దూరంలో విగతజీవుడై పడి ఉన్నాడు. రన్నింగ్ ట్రైన్ నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు బ్రౌన్ కలర్ టీషర్టు ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని చెప్పారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440627546 నంబరులో సంప్రదించాలని కోరారు.

షెడ్యూల్ కంటే ముందే పరీక్షపై ఫిర్యాదు



ఆచార్య గంగాధరరావుకు ఫిర్యాదు చేస్తున్న ఎన్డీఎస్ఎఫ్ నాయకులు

పెదకాకాని, ఆగస్టు 29: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా సెమిస్టర్ ఎగ్జామ్‌ను నిర్వహిస్తున్న డిపార్ట్మెంట్ కో ఆర్డినేటర్ బి.శేఖర్‌బాబును ఎన్డీఎస్ఎఫ్ నాయకులు గురువారం అడ్డుకుని వర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ ఎగ్జామ్‌ను షెడ్యూల్ ప్రకారం 29న మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరపాల్సి ఉండగా, ఎటువంటి కారణం లేకుండా, పైఅధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్దేశించిన షెడ్యూల్ కంటే ముందు ఉదయం 10 గంటలకే నిర్వహిస్తున్నారు. సంగతి తెలియడంతో ఎన్డీఎస్ఎఫ్ నాయకులు వెళ్లి డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్‌ను వివరణ అడుగగా, సరిగా సమాధానం చెప్పకపోవడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో నాయకులు విషయాన్ని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయమని సూచించడంతో విద్యార్థి నాయకులు విషయాన్ని ఇన్చార్జి వైస్ ఛాన్సలర్, రెక్టర్, రిజిస్ట్రార్‌ల వద్దకు తీసుకెళ్లారు. అధికారులు సానుకూలంగా స్పందించి ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, ఈ విషయంతో పాటు వాటి మీద కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థి ఆందోళనను విరమించారు. ఎన్డీఎస్ఎఫ్ ప్రెసిడెంట్ రత్న సాగర్, సెక్రటరీ గణేష్, వైస్ ప్రెసిడెంట్ రత్న కిషోర్, ట్రెజరర్ మధు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, ఆగస్టు 29: జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడి కక్కడే మరణించగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిన కొండ్రుపాడు జాతీయ రహదారిపై హైవే అథారిటీకి చెందిన ట్రాక్టర్ మార్జిన్‌లో పార్క్ చేసి ఉంది. గుంటూరు శ్రీనివాసరావుపేటకు చెందిన కుంచాల అంకమ్మరావుతో పాటు మరో ముగ్గురు కారులో చిలకలూరిపేటలో ఒక ఫంక్షన్‌కు వెళ్తున్నారు. అయితే అతి వేగంగా కారు నడుపుతూ ఆగివున్న ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీకొట్టాడు. ముందు వైపు డ్రైవర్ పక్కనే కూర్చున్న కుంచాల అంకమ్మరావు (35) కారులోనే అక్కడి కక్కడే మరణించాడు. కారు నడుపుతున్న చల్లా శ్రీనివాసరావుతో పాటు లాలం చిరంజీవి, మల్లెల మూర్తికి తీవ్ర గాయాలైయ్యాయి. వీరిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

421 మద్యం సీసాలు స్వాధీనం



పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ మద్యం సీసాలు

మాచవరం, ఆగస్టు 29: తెలంగాణ రాష్ట్రం నుంచి కృష్ణానదిపై నాటు పడవల ద్వారా అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను పట్టుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకొని, ఒక కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మాచవరం ఎస్ఐ కె.సతీష్ గురువారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. విశ్వసనీయ సమాచారం మేరకు గోవిందాపురం కృష్ణానది సమీపంలో దాడులు చేయగా తెలంగాణ రాష్ట్రం నుంచి నాటు పడవల ద్వారా కృష్ణానది దాటించి వేర్వేరు ప్రాంతాలకు మద్యం సీసాలను తరలించే పనిలో నిమగ్నమైన తెలంగాణ రాష్ట్రానికి చెందిన బడుగుల నాగరాజు, తొడేటి నరేష్, మాచవరం మండలం శ్రీరుక్మిణీపురం గ్రామానికి చెందిన బత్తుల సత్యనారాయణ, మాచవరంకు చెందిన మహంకాళి వెంకటరావు, మోర్జంపాడు గ్రామానికి చెందిన శ్రీను అనే ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 421 మద్యం సీసాలు, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

పూడిక తీయరు.. మురుగు పారదు

- కాలువల్లోనే తాగునీటి పైపు లైన్లు
- అన్ని విభాగాల్లో దోమల స్వైరవిహారం
- సర్వజన ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణేది ?


ఓపీ రోగులకు మందు ఇచ్చే చోట ...బోరు చుట్టూ చేరిన మురుగునీరు


తాగునీటి కూలర్ చుట్టూ మురుగు నీరు

ఓపీ విభాగం వద్ద డ్రైయినేజీ దుస్థితి

గుంటూరు(విద్య), ఆగస్టు 28: నిత్యం వేల సంఖ్యలో వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా అవుట్ పేషెంట్ (ఓపీ) విభాగం వద్ద నిత్యం అపరిశుభ్ర వాతావరణమే కనిపిస్తోంది. అక్కడ సరైన డ్రైయినేజీ విధానం లేకపోవడంతో వార్డుల్లో మురుగునీరు కాల్వల్లో నుంచి పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. పగలూరాత్రీ తేడా లేకుండా అక్కడ దోమలు స్వైర్వవిహారం చేస్తున్నాయి. తమ రోగాలను నయం చేసుకునేందుకని ఆస్పత్రికి వస్తే ఇక్కడి అధ్వాన పారిశుధ్యంతో కొత్త రోగాలు వచ్చేలా ఉన్నాయని రోగులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. అలాగే తాగునీటి పైపులు కొన్ని మురుగునీటిలో నుంచే ఏర్పాటు చేశారని, ఏదైనా లీకేజీ జరిగి, ఆ నీటిని తాగితే ఏంటి పరిస్థితి అని ఆస్పత్రిలోని రోగులు ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రి ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు.


ఓపీ విభాగం వద్ద కాల్వల్లో నిలిచిపోయిన మురుగునీరు

సీటీ శాఖలో ఆర్‌వోలను రద్దు చేయండి

● ఉద్యోగుల నిరసన ప్రదర్శన

గుంటూరు, ఆగస్టు29: గత వైసీపీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో వాణిజ్య పన్నులశాఖలో ఏర్పాటుచేసిన ఆర్‌వో (రీజనల్ ఆఫీస్)లను వెంటనే రద్దు చేయాలని, అప్పటి వరకు ఉద్యోగుల బదిలీల ప్రక్రియను వాయిదా వేయాలని ఏపీ సీటీ, సర్వీసెస్ అసోసియేషన్‌గుంటూరు-1, 2 డివిజన్‌ల అధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఏఎస్ సోమశేఖరరావు కోరారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మూడు రోజులుగా రెండు డివిజన్‌లలో అసోసియేషన్‌కు చెందిన ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ హయాంలో సంస్కరణల పేరుతో జరిగిన విధ్వంసంపై కూటమిప్రభుత్వం విచారణ జరపాలని కోరారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా గతంలో జరిగిన ఉద్యోగుల బదిలీలపై విచారణ జరపాలని, సీటీ శాఖలో అధికారాల కేంద్రీకరణను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. జీఎస్‌టీవోలకు చట్టబద్ధమైన అధికారాలను ఇవ్వాలని సర్కిల్స్ వ్యవస్థను నీరుగార్చే చర్యలను మానుకోవాలని, ఉద్యోగుల బదిలీలపై శాశ్వత విధానం రూపొందించాలని కోరారు. అప్పటివరకు తాజాగా తలపెట్టిన బదిలీల ప్రక్రియను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.


ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నసీర్

అర్హులకు త్వరలోనే పింఛన్, రేషన్ కార్డులు

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో లబ్ధిదారులకు పింఛన్లు, రేషన్ కార్డులు త్వరలోనే అందజేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని జానీ సూరజ్ నగర్, యానాది కాలనీలో గురువారం అయన పర్యటించి.. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో కరెంటు బిల్లులు ఎక్కువగా వచ్చాయన్న సాకుతో వృద్ధులకు పెన్షన్లు తీసేశారని, రోడ్లు, డ్రైన్ల సమస్య ఎక్కువగా ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే దష్టికి తెచ్చారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ జానీ సూరజ్ నగర్, యానాది కాలనీలో ఉన్న రోడ్డు, అండర్ డ్రైనేజ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, దాని నిర్మాణానికి అవసరమైన అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు కేటాయించిన టిడ్కో గృహాలను నేటి వరకు వారికి అందించకపోవడం గత వైసీపీ ప్రభుత్వ పాలకుల చేతకానితనమని, వాటిని ప్రజలకు అందజేయకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే టిడ్కో గృహాలను ముఖ్యమంత్రి లబ్ధిదారులకు అందజేస్తారని హామీ ఇచ్చారు. లబ్ధిదారులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.4,000 పింఛన్‌ను త్వరలోనే అందిస్తామని చెప్పారు. ఈ పర్యటనలో ఉస్మాన్, జమీర్, రియాజ్, ఆదిల్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

'ఫ్రీడమ్ ఫైట్' పుస్తకం ఆవిష్కరణ

గుంటూరు, ఆగస్టు 29 : స్వతంత్ర పోరాటాన్ని వ్యక్తిగత హక్కుగా మార్చిన పుస్తకమే 'ఫ్రీడమ్ ఫైట్' అని తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అన్నారు. రచయిత డాక్టర్ సీఎస్ రావు రాసిన ఈ పుస్తకాన్ని గురువారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పుస్తకావిష్కరణ షఖషష ష కార్యక్రమంలో ఆస్ప భారత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ ముంజంపల్లి శివకుమార్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, టీడీపీ నాయకుడు మహంకాళి నరసింహారావు, వంగర ఏడుకొండలు పాల్గొన్నారు.

ఒన్‌స్టాప్ సెంటర్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ● మహిళ ప్రాంగణంలో విస్తృత పర్యటన


మహిళ ప్రాంగణంలో పర్యటిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆపదలో వున్న మహిళలను ఆదుకోవడమే ధ్యేయంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఒన్‌స్టాప్ సెంటర్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్తు కార్యాలయానికి ఎదురుగా వున్న మహిళ ప్రాంగణంలోని శిశు గృహ, కళాశాల విద్యార్థినుల వసతి గృహం, ఒన్ స్టాప్ సెంటర్, కొత్తగా నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా వున్న ఉద్యోగినుల వసతిగృహం (సఖి నివాస్‌భవనం), డొమెస్టిక్ వయొలెన్స్ సెంటర్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. ఒన్ స్టాప్ సెంటర్‌లోని పెండింగ్ కేసుల వివరాలను, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను న్యాయవాది ఎ.విజయలక్ష్మి ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. కొత్తగా నిర్మించిన ఉద్యోగినుల వసతి గృహానికి చేపట్టాల్సిన మైనర్ పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేపట్టాలని, ఆంధ్రప్రదేశ్ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మజను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థినుల వసతి గృహాన్ని పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. శిశు గృహంలోని చిన్నపిల్లల బాగోగులను, ఆరోగ్య పరిరక్షణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసు కోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి, నోడల్ ఆఫీసర్ శ్రీవాణి, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ కృష్ణవేణి, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ పర్యవేక్షకులు మీనా కుమారి పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులు ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

గుంటూరుసిటీ: భారతీయ రిజర్వ్ బ్యాంక్ స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. అందులో భాగంగా గుంటూరు జిల్లాలోని 8 యూనివర్సిటీలు, 186 కాలేజీల్లో డిగ్రీ విద్యార్థులందరూ ఈ పోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రెరా' లో డైరెక్టర్లను నియమించండి

గుంటూరు(తూర్పు), ఆగస్టు29: రియల్ ఎస్టేట్ రెగ్యులేరీ అథారిటీ (రెరా)లో డైరెక్టర్లను నియమించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట స్థానిక ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన గాయత్రి బిల్డర్స్ యాజమాని ములుపూరి వేణుబాబు నిరసన చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గేటు ఎదుట నిలబడి నిరసన తెలిపారు. అనంతరం మీడియాతో అయన మాట్లాడుతూ మూడు నెలల నుంచి నియామకాలు లేకపోవడంతో రెరా నుంచి అనుమతి లేఖలు రావడం లేదని, దీంతో అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రెరా కార్యాలయాన్ని సంప్రదిస్తే అప్రూవల్ అథారిటీ నియామకం జరగలేదని చెబుతున్నారని , గుంటూరు నుంచి దాదాపు 200కు పైగా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. రెరా అనుమతి ఇస్తేనే బ్యాంకు నుంచి రుణాలు మంజూరు చేస్తారని, దీనిని దృష్టిలో పెట్టుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. నియామకాలు ఆలస్యమయ్యే సందర్భంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో అనుమతి లేఖలను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను పరిష్కరించని నేపథ్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు వివరించారు.

14న జాతీయ మెగా లోక్ అదాలత్

గుంటూరు, ఆగస్టు 29: జిల్లాలో సెప్టెంబరు 14న జరగబోయే జాతీయ మెగాలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. ఎస్పీ మాట్లాడుతూ జాతీయ లోక్ దాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులలో ఇరుపక్షాల సమ్మతితో వారి వారి కేసులను పరిష్కరించే దిశగా చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. ఇతర కేసులను కూడా లైనంతవరకు ఎక్కువగా డిస్పోజల్ చేయాలని చేయాలని పోలీస్ అధికారులకు తెలిపారు. కోర్టులలో లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు అవగాహన కల్పించాలని, ఇరుపక్షాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, ఎక్కువ కేసులను డిస్పోజల్ చేయాలని అధికారులకు ఆదేశించారు.


కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు,అధ్యాపకులు

విజ్ఞాన్‌లో జాతీయ క్రీడా దినోత్సవం

గుంటూరు(విద్య),ఆగస్టు 29: స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వ విద్యాలయంలో గురువారం ధ్యాన్‌చంద్ జయంతిని పురష్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వీసీ ఆచార్య నాగభూషణ్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక వికాసం సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్

బదిలీలకు నేడు కౌన్సెలింగ్

గుంటూరు(విద్య),ఆగస్టు 29: ఉమ్మడి జిల్లా పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు నేడు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూధనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలకు ఇప్పటికే 189 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 8 గంటలకు స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని పరివర్తనాభవన్‌కు రావాలని సూచించారు. బదిలీల కౌన్సిలింగ్ ఉదయం 11 గంటలకు ముగుస్తుందని పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అసిస్టెంట్స్ పెన్షన్ల పంపిణీలో పాల్గొనాలని తెలిపారు.

లక్ష మొక్కలు నాటతాం

గుంటూరుసిటీ, ఆగస్టు 29: జిల్లా వ్యాప్తంగా జరగనున్న వనమహోత్సవం కార్యక్రమంలో లక్ష మొక్కలు నాటనున్నట్లు గుంటూరు జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా వెల్లడించారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, పేరేచర్ల నగర వనంలో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో తహశీల్దార్‌లు, ఎంపీడీఓలు కార్యక్రమం నిర్వహిస్తారని, అన్ని మండలాల్లో మొక్కలు నాటేందుకు వీలుగా లక్షమొక్కలు సమకూర్చినట్లు తెలిపారు. వనమహోత్సవంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల యజమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

8న బాడీ బిల్డింగ్, కెటిల్ బెల్ ఛాంపియన్‌షిప్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 29: స్థానిక 'ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా ఫిట్‌నెస్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్, బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్, ఏపీ గిరవయ్ స్పోర్ట్స్ అసోసియేషన్ కెటిల్ బెల్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబరు 8న మిస్టర్ జోనల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్, రాష్ట్ర స్థాయి కెటిల్ డెల్ ఛాంపియన్ షిప్ - 2024 పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రపసాదు పాల్గొని పోటీలకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో పలు అసోసియేషన్ కార్యదర్శులు నాగగౌతమ్, ఎండీ జావిద్ అహ్మద్, ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

21 మంది సహకార ఉద్యోగులకు నోటీసులు

గుంటూరు సిటీ, ఆగస్టు 29 : గుంటూరు జిల్లాలోని 21 మంది సహకార శాఖ ఉద్యోగులపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఈ మధ్య కాలంలో జిల్లాలోని జీడీసీసీ బ్యాంకులు,సహకార సంఘాల్లో పలు అక్రమాలు జరిగిన విషయం విదితమే. గుంటూరు, నల్లపాడు, ప్రత్తిపాడు జీడీసీసీ బ్యాంకుల్లో భారీ స్థాయిలో నకిలీ రుణాలు మంజూరయ్యాయి. కోల్డ్ స్టోరేజ్‌లలో రైతులు నిల్వ ఉంచిన మిర్చి పంటను చూపించి వేరే వ్యక్తులు రుణాలు పొందారు. ప్రత్తిపాడు, పొన్నూరులోనూ అవకతవకలు జరిగాయి. జీడీసీసీ బ్యాంకులు వేదికగా ఇంత మోసం జరుగుతున్నా సహకారశాఖలో కీలకపాత్ర పోషించే అధికారులు, ఆడిటర్లు నిమ్మకు నీరెత్తినట్లు వున్నారు. ఆయా బ్యాంకుల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చిన తర్వాత విచారణ జరిపిన జిల్లా సహకార శాఖ అధికారి రాష్ట్ర అధికారులకు నివేదికను పంపినట్లు తెలుస్తోంది. కొందరు అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించడ వల్లే ఇటువంటి అక్రమాలు చోటుచేసుకున్నట్లు భావించిన రాష్ట్ర అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలోనే మొత్తం 21 మందికి నోటీసులు జారీచేశారు. దానికిసదరు అధికారులు సమాధానం ఇచ్చిన తర్వాత వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఈ విషయమై బ్యాంక్‌కు చెందిన కొందరు ఉద్యోగులు కోర్టుకు వెళ్లినట్లు తెలుస్తోంది.


పాటిబండ్ల సీతారామయ్య హై స్కూల్లో జరిగిన తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు

గిడుగు వెంకట రామ్మూర్తికి ఘన నివాళులు

● వివిధ ప్రాంతాల్లో తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాలు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 29 : తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పాఠశాల సెక్రటరీ, కరస్పాం డెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గిడుగు గురించి విద్యార్థులు పాటలతో, ఉపన్యాసాలతో కవితలతో, నృత్య కార్యక్రమాలతో నాటక ప్రదర్శన, ప్రాచీన, ఆధునిక కవుల సాహిత్య పటిమను పద్యాల రూపంలో పాడి అబ్బురపరిచారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.హనుమంతరావు, పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాద్ రావు, పాఠశాల డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, కోఆర్డినేటర్లు డి.దుర్గా శ్యామ్, టి.శ్రీదేవి పాల్గొన్నారు.

గుంటూరు సిటీ : కలెక్టరేట్‌లోని తెలుగు తల్లి విగ్రహానికి బీజేపీ కిసాన్ మోర్చ జాతీయ ఉపాధ్యక్షుడు సురేష్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్,ఒంగోలు జిల్లా ఇన్‌చార్జి పునుగుళ్ళ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు(తూర్పు): స్థానిక సంగడిగుంట, పవర్‌పేట, నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రముఖ సాహితివేత్త దారివేముల అనిల్ కుమార్ నేతృత్వంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా జాతీయ నమూనా సర్వే విభాగ విశ్రాంత సహాయ సంచాలకులు జొన్నలగడ్డ నాగ రాజారావు హాజరై మాట్లాడారు.

గుంటూరు(విద్య): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ. పాఠశాలలో ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రాంప్రసాద్ కంచర్ల మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక ధృడత్వాన్ని పెంచుతాయని అన్నారు. అలాగే మాతృభాషను ఎవరూ మరువరాదని సూచించారు. అనంతరం పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమేనని, పద్యాలు, మన పురాణాలు, మన ఇతిహాసాలు వల్ల జ్ఞానం వస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య పాల్గొన్నారు.

గుంటూరు : తెలుగు భాష దినోత్సవం సందర్భంగా అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గుంటూరు జిల్లా రచయితల సంఘం, అవగాహన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి, కవిసమ్మేళనం జరిగాయి. కార్యక్రమ సమన్వయకర్తలుగా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. ఎం. సుభాని, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ముఖ్య అతిథి, వక్తగా ప్రముఖ రచయిత, సరస్వతిపుత్ర డాక్టరు భూసురపల్లి వెంకటేశ్వర్లు, ఆత్మీయ అతిథిగా ప్రముఖ రచయిత్రి షేక్ ఖాసింబి, రచయితల సంఘం కోశాధికారి నానా తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమా మహేశ్వరరెడ్డి, వశిష్ట సోమేపల్లి తదితరులు పాల్గొన్నారు.


గిడుగు చిత్ర పటానికి నివాళులు అర్పించిన కలెక్టర్, ఇతర అధికారులు

తెలుగు భాష అభివృద్ధికి కృషి చేసిన 'గిడుగు'

● జయంతి కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మీ

గుంటూరు సిటీ,ఆగస్టు 29 : తెలుగు భాష అభివృద్ధికి కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి సేవలను గుర్తిస్తూ ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అన్నారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజతో కలసి గిడుగు చిత్ర పటానికి కలెక్టర్ నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకో వలసిన బాధ్యత మన అందరిపై వుందని, 'తెలుగు' ఔన్నత్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, బీసీ కార్పొరేషన్ ఈడి దుర్గాబాయి , డిపిఓ కె. శ్రీదేవి, డియం అండ్ హెచ్‌ఓ డా. విజయ లక్ష్మీ, టూరిజం అధికారి రమ్య , జిల్లా కో ఆపరేటివ్ అధికారి వీరాచారి , కలక్టరేట్ ఏ.ఓ పూర్ణచంద్ర రావు పాల్గొన్నారు.


వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డీఈవో శైలజ తదితరులు

వ్యాయామ ఉపాధ్యాయులకు సత్కారం

గుంటూరు(విద్య),ఆగస్టు 29: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాయామ ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను గురువారం స్థానిక విద్యాశాఖాధి కారి కార్యాలయంలో డీఈవో పీ.శైలజ ఘనంగా సత్కరించారు. గత విద్యాసంవత్సరం క్రీడలలో ఎక్కువ మందిని రాష్ట్ర,జాతీయ స్థాయిలలో ఆడించిన పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులను ఎంపిక చేసి అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బాషా, స్కూల్ గేమ్స్ జిల్లాకార్యదర్శి రవి, వ్యాయామ ఉపాధ్యాయసంఘం జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, రమేష్,అశోక్ పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

వ్యాయామంతో మెరుగైన ఆరోగ్యం

● గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వ్యాయామంతో మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని, ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని దినచర్యగా మార్చుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. నగరంలోని పలు కార్యక్రమాల్లో గురువారం ఆమె పాల్గొన్నారు. తొలుత గుంటూరు పట్టాభిపురం మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ మారుతున్న జీవన శైలికి అనుగుణంగా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాని, రోజువారీ వ్యాయామంతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని చెప్పారు. అనంతరం 42వ డివిజన్ ఎస్‌వీఎన్ కాలనీ నారాయణస్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులోని నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా హాకీ టోర్నమెంట్ పోటీలను ఆమె ప్రారంభించారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

రైతులకు చేరువగా ప్రకృతి వ్యవసాయం

● జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, ఆగస్టు 29 : ప్రకృతి వ్యవసాయాన్ని రైతులకు మరింత చేరువచేసేలా జిల్లాలోని రైతు శాస్త్రవేత్తలు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక కృషి భవన్ లో జరిగిన రైతు శాస్త్రవేత్తల మూడవ సెమిస్టర్ లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సెమిస్టర్ లో గుంటూరు ,పల్నాడు , ఎన్టీఆర్ కృష్ణ , బాపట్ల జిల్లాలకు చెందిన రైతు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఏకోలోజీ రిసెర్చ్ అండ్ లెర్నింగ్ లో భాగంగా నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, రైతులను ఏ విధంగా ప్రకృతి వ్యవసాయం దిశగా తీసుకు వెళ్ళాలనే దానిపై రైతు శాస్త్రవేత్తలు ఆలోచించాలని వెంకటేశ్వర్లు సూచించారు. గుంటూరు జిల్లా డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ రాజ కుమారి , అకాడమీ టీఎల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న మునిస్వామినాయుడు, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

క్రీడా స్ఫూర్తితోనే యువతలో సంపూర్ణ వికాసం

● ఏపీపీసీబీ ముఖ్య ఇంజనీరు పీ.మునిస్వామినాయుడు

గుంటూరు(విద్య),ఆగస్టు 29: యువతలో క్రీడా స్ఫూర్తితోనే సంపూర్ణ వికాసం సాధ్యామౌతుందని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోలు బోర్డు ముఖ్య ఇంజనీరు పి. మునిస్వామినాయుడు అన్నారు. చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో గురువారం జరిగిన జాతీయ క్రీడా, తెలుగుభాషా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొని దేశ ప్రతిష్ట పెంచాలని కోరారు. తెలుగుభాష ప్రతిష్టను మరింత పెంచేలా యువత కృషి చేయాల సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ మాట్లాడుతూ తెలుగుభాషాభివృద్ధికి కృషి చేసిన గిడుగు రామ్మూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా షటిల్,క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి నగదు,జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సిఎన్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

శుక్రవారం • 30 ఆగస్టు 2024

cinema@andhrajyothy.com

రజనీకాంత్ చిత్రంలో నాగార్జున

రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'కూలీ' చిత్రంలో అక్కినేని నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ఈ విషయాన్ని ప్రకటించింది. ఇందులో ఆయన పోషిస్తున్న సైమన్ పాత్రను పరిచయం చేస్తూ యూనిట్ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అలాగే నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్న మరో చిత్రం 'కుబేర' నుంచి ఆయన స్టైలిష్ లుక్‌ను విడుదల చేశారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మగవాళ్లనూ వదల్లేదు

• దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై తాజా ఆరోపణ

మాలీవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక పరిశ్రమను కుదిపేస్తోంది. తాజాగా మరి కొందరు మలయాళ సినీ ప్రముఖులపై అత్యాచారం కేసులు నమోదయ్యాయి. నటి మిను మునీర్ ఆరోపణలతో బుధవారం నటుడు, సీపీఎం ఎమ్మెల్యే ముఖేశ్, హీరో జయసూర్యపై అత్యాచారం కేసు నమోదు చేశారు. వీరితో పాటు మరో ఐదుగురిపైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీంతో ఇప్పటివరకూ 17 మందిపై కేసులు నమోదయ్యాయి.

అవకాశం ఇస్తానని...

మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ తనను లైంగికంగా వేధించాడని బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే అతను ఆడవాళ్లనే కాదు మగవాళ్లనూ వదల్లేదు అని కోజికోడ్‌కు చెందిన సజీర్ అనే వ్యక్తి సంచలన ఆరోపణలు చేశాడు. తనపైన 2012లో రంజిత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సజీర్ కేరళ డీజీపీకి ఫిర్యాదు చేశాడు. "సినిమా అవకాశం ఇస్తానని చెప్పి బెంగళూరులోని తాజ్ హోటల్‌కు అర్ధరాత్రి పిలిపించుకున్నాడు. గదిలోకి వెళ్లాక నా దుస్తులు తొలగించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నా ఫొటోలు తీశాడు. 'వాటిని ఎవరికి పంపావు' అని అడిగితే 'లోపలి గదిలో నటి రేవతి ఉన్నారని రంజిత్ నాతో చెప్పాడు. అయితే ఆమె నిజంగా అక్కడ ఉన్నారా? లేదా, వారిద్దరి మధ్య ఎలాంటి సంబంధం ఉందనేది నాకు తెలియదు' అని సజీర్ చెప్పాడు.

పృథ్వీరాజ్ తగిన వ్యక్తి

అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో బాధ్యతలు నిర్వహించేందుకు హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ తగిన వ్యక్తి అని నటి మిను మునీర్, పార్వతి తిరువోతు అభిప్రాయపడ్డారు. అమ్మ ఎగ్జిక్యూటివ్ ప్యానెల్ మూకుమ్మడి రాజీనామాపై నటి పార్వతి తిరువోతు స్పందించారు. అసోసియేషన్‌లో నిరంకుశ పాలన నడుస్తోందని ఆరోపించారు. మీడియా ముందుకొచ్చి మాట్లాడే అవకాశం లేకపోవడంతోనే రాజీనామా చేశామన్నారు. తమ నిర్ణయం పిరికితనంగా అనిపించిందన్నారు. ఇంతమంది మహిళలు ధైర్యంగా బయటకొచ్చి ఫిర్యాదు చేస్తున్నా కేరళ ప్రభుత్వం విచారణలో నిర్లక్ష్యం చూపుతోందని మిను ఆరోపించారు.



హేమ కమిటీకి సమంత ప్రశంసలు

మలయాళ చిత్రపరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికితేవడంలో హేమ కమిటీ పనితీరు అద్భుతంగా ఉందని టాలీవుడ్ కథానాయిక సమంత ప్రశంసించారు. అలాగే ఈ కమిటీ ఏర్పాటుకు కారణమైన డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్) సంస్థనూ ఆమె అభినందించారు. ఆ సంస్థ సభ్యుల కష్టం వల్లే ఈ రోజు మహిళల సమస్యలు చర్చనీయాంశంగా మారాయని చెప్పారు. సినీ పరిశ్రమలో మహిళల సంరక్షణ కోసం ఆ సంస్థ అవిశ్రాంతంగా పాటుపడుతోందని అభినందించారు. 'డబ్ల్యూసీసీ గురించి నాకు చాలా కాలంగా తెలుసు. ప్రభుత్వం హేమ కమిటీ ఏర్పాటు చేయడానికి ఆ సంస్థ తీసుకున్న చొరవే కారణం. వారి పోరాటానికి నా కృతజ్ఞతలు' అన్నారు.

కోలీవుడ్‌లోనూ కమిటీ

'అడ్జెస్ట్‌మెంట్' పేరుతో సినిమా అవకాశాలు ఇస్తామని గాలం వేసేవారు ఎంతటివారైనా చెప్పుతో కొట్టాలని 'నడిగర్ సంఘం' ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్ పిలుపునిచ్చారు. జస్టిస్ హేమ కమిషన్ తరహాలోనే కోలీవుడ్‌లోనూ నడిగర్ సంఘం ఆధ్వర్యంలో పది మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం అని చెప్పారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/6tDC2Mxలో చదవండి.

నవరస నటనకు యాభై ఏళ్లు!



ఎన్టీఆర్ వంటి మహా నటుడికి వారసుడు కావడం ఒక విధంగా బాలకృష్ణ అదృష్టం, మరో రకంగా అగ్నిపరీక్ష కూడా. తండ్రి పేరు నిలబెట్టి ఆ విషయంలో విజయం సాధించారు బాలకృష్ణ. యాభై ఏళ్లక్రితం సరిగ్గా ఇదే రోజున విడుదలైన 'తాతమ్మ కల'(1974 ఆగస్టు 30) చిత్రంతో చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. సాధారణంగా 30 ఏళ్లో, నలభై ఏళ్ల కాలమో కథానాయకుడిగా నటించి, ఆ తర్వాత క్యారెక్టర్ పాత్రలకు షిఫ్ట్ అయిన నటులు ఎందరో! కానీ బాలకృష్ణ విషయం చాలా ప్రత్యేకం. తొలి సినిమా 'తాతమ్మ కల' నుంచి ఇప్పటి వరకూ ఒక్క ఏడాది కూడా గ్యాప్ తీసుకోకుండా హీరోగానే నటిస్తూ యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకుని చరిత్ర సృష్టించారు బాలకృష్ణ. సెప్టెంబర్ ఒకటిన దక్షిణాది చిత్ర పరిశ్రమలోని అతిరథ మహారథుల సమక్షంలో ఆయనకు భారీ సన్మానం జరుగుతున్న నేపథ్యంలో ఆయన కెరీర్‌లో మలుపులు, మెరుపులు....

ప్రపంచ వ్యాప్తంగా ఎందరో నటీనటులు తమ వారసుల్ని వెండితెరకు పరిచయం చేశారు. ఆ సంప్రదాయాన్ని మన దేశంలో మహానటుడు పృథ్వీరాజ్ కపూర్ అనుసరించారు. ఆయన తనయులు రాజ్ కపూర్, షమ్మీ కపూర్, శశి కపూర్ తండ్రి లాగానే నటనను వృత్తిగా స్వీకరించి తమదైన బాణీ పలికించారు. రాజ్ కపూర్ కూడా తండ్రిని ఆదర్శంగా తీసుకొని తన ముగ్గురు కొడుకుల్ని హీరోలుగా పరిచయం చేశారు. దక్షిణాది మహా నటుడు నందమూరి తారకరామారావు ఈ విషయంలో రాజ్ కపూర్‌ను అనుసరిస్తూ తొలిసారిగా తెలుగు నాట తన తనయులు హరికృష్ణ, బాలకృష్ణను నటనా రంగంలో అడుగు పెట్టేలా ప్రోత్సహించారు. అయితే నట వారసుల్లో ఎవరికీ లేనంత సుదీర్ఘమైన కెరీర్ బాలకృష్ణ సొంతం.

- బాలకృష్ణ నటించిన తొలి చిత్రం 'తాతమ్మ కల'కు కూడా కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. కుటుంబ నియంత్రణ విధానాన్ని దేశంలో తొలిసారిగా ప్రవేశపెట్టినప్పుడు ఆ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎన్టీఆర్ నిర్మించిన సినిమా ఇది. యాభై రోజుల ప్రదర్శన పూర్తి చేసుకున్న తర్వాత సినిమాను ఆపేసి, చిన్న చిన్న మార్పులతో మళ్లీ విడుదల చేశారు. రెండు సార్లు సెన్సార్ అయి, రెండు సార్లు విడుదల అయిన సినిమా తెలుగులో ఇదొక్కటే. ఇందులో బాలకృష్ణది బాలనటుడి పాత్ర కాదు. కథలో కీలకమైన పాత్ర.
- ఎన్టీఆర్ అనితర సాధ్యంగా అభినయించిన శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలను బాలకృష్ణ సైతం పోషించి అభిమానుల్ని అలరించారు. అంతే కాదు ఎన్టీఆర్ పోషించని అభిమన్యు, నారద, ఆంజనేయ పాత్రలను బాలకృష్ణ పోషించి అభినందనలు అందుకున్నారు. పెద్దాయన పాతాళ భైరవి వంటి జానపద చిత్రాల్లో నటిస్తే, బాలయ్య భైరవ ద్వీపం సినిమాతో అభిమానులను ఆకట్టుకున్నారు.
- ఒకే చిత్రంలో అటు భగవంతుడు, ఇటు భక్తునిగా నటించిన ఘనత తెలుగు నాట ఎన్టీఆర్, బాలకృష్ణ దే. 1964లో వచ్చిన శ్రీ సత్యనారాయణ మహత్యం' లో ఎన్టీఆర్ శ్రీ మహా విష్ణువుగా, సత్యవ్రతుడిగా నటించారు. అలాగే 'పాండురంగడు' లో బాలయ్య శ్రీకృష్ణ, పుండరీక పాత్రలతో మెప్పించారు.
- బాలకృష్ణ ఎప్పుడూ ట్రెండ్‌ను ఫాలో కాలేదు. ఆయన నటిస్తేనే అది ట్రెండ్ అయింది. ఆ ట్రెండ్‌ను తర్వాత మిగిలిన హీరోలందరూ ఫాలో కావడం గమనార్హం. డిస్కో డ్యాన్సులు, మెషిన్‌గన్స్‌తో యాక్షన్ సినిమాలు వస్తున్న రోజుల్లో బాలకృష్ణ పంచె కట్టుతో, కర్ర సాముతో బాక్సాఫీసు దగ్గర కాసుల వర్షం కురిపించారు. ఆ తర్వాత చాలా కాలం తెలుగులో గ్రామీణ వాతావరణంలో సినిమాలు వచ్చాయి. అలాగే తెలుగులో ఫ్యాక్షన్ సినిమాల నిర్మాణం బాగా పెరగడానికి బాలకృష్ణ నటించిన 'సమరసింహా రెడ్డి', 'నరసింహనాయుడు' చిత్రాల సంచలన విజయమే కారణం.
- ఎన్టీఆర్ తన 52 వ ఏట బాపు దర్శకత్వంలో రూపొందిన శ్రీరామాంజనేయ యుద్ధం చిత్రంలో శ్రీరామునిగా నటించారు. అలాగే బాలకృష్ణ కూడా తన 52 వ ఏటనే అదే బాపు దర్శకత్వంలో శ్రీరామరాజ్యం చిత్రంలో శ్రీరామునిగా నటించడం విశేషం.
- తండ్రి పేరుతో తీసిన బయోపిక్ లో తనయుడు హీరోగా నటించిన సందర్భాలు గతంలో లేవు. అరుదైన ఆ ఘనత బాలయ్య కే దక్కింది. ఎన్టీఆర్ బయోపిక్ కథానాయకుడు, మహానాయకుడు చిత్రాల్లో బాలయ్య ఎన్టీఆర్ గా కనిపించడంతో అభిమానులు మురిసిపోయారు.
- రాజకీయ నాయకునిగా కూడా తండ్రి వారసత్వాన్ని కాపాడుతున్నారు బాలకృష్ణ. మూడు సార్లు హిందూపరం శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన బాలకృష్ణ ప్రజా సేవలోనూ తన ముద్రను చాటారు.

ఇప్పటివరకూ రాని సినిమా



హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలీ 'రాజ రాజ చోర' చిత్రం తర్వాత కలసి చేస్తున్న చిత్రం 'శ్వాగ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇందులో రాజు, భవభూతి, సింగ, యయాతి పాత్రలను శ్రీవిష్ణు, రాణి రుక్మిణీదేవి పాత్రలో రీతూ వర్మ నటించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ ' మన అందరి ఇళ్లలో ఉన్న పాయింటే అయినా ఇండియన్ స్ర్కీన్ మీద ఇప్పటివరకూ రాని సినిమా ఇది. ఇలాంటి సినిమా తీయడానికి ముందుకు వచ్చిన విశ్వప్రసాద్ గారికి కృతజ్ఞతలు. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అన్నారు. 'శ్రీవిష్ణు, హసిత్‌తో కలసి ఇంతకుముందు 'రాజ రాజ చోర' సినిమా చేశాం. 'శ్వాగ్' చాలా విభిన్న చిత్రం' అని తెలిపారు విశ్వప్రసాద్. దర్శకుడు హసిత్ గోలీ మాట్లాడుతూ 'ఇది అచ్చ తెలుగు సినిమా. కంటెంట్ చాలా మాట్లాడుతుంది. తాత, ముత్తాతలతో కలసి చూడగలిగే సినిమా. విష్ణు బాగా చేశారు. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అన్నారు. మీరా జాస్మిన్, దక్ష నాగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు, గెటప్ శ్రీను, గోపరాజు రమణ తదితరులు నటించారు.

ఐదు భాషల్లో 'కుంభ'



స్వీయ దర్శకత్వంలో వి.సముద్ర నిర్మించే 'కుంభ' చిత్రం గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. హీరో విజయ్‌రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు సముద్ర సతీమణి విజయలక్ష్మి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత డీఎస్ రావు తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు చంద్రమహేశ్, దేవిప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. 'కథలను నమ్ముకుని కొత్త వాళ్లతో ఐదు సినిమాలు తీస్తున్నాను. వాటిల్లో 'కుంభ' ఒకటి. ఐదు భాషల్లో ఈ సినిమా తయారవుతుంది' అని సముద్ర చెప్పారు. విజయ్‌రామ్ హీరోగా, సూరజ్ ఆదిత్య విలన్‌గా నటిస్తున్నారు.

క్లుప్తంగా..



తెలుగు భాషా దినోత్సవం రోజున...

ఎప్పటినుంచో తెలుగు భాష, సంస్కృతి, విలువల గురించి సినిమా తీయాలనే కోరిక ఉంది. సందేశంలా కాకుండా మంచి వాణిజ్య విలువలు ఉన్న అంశాలు కలిగిన కథ దొరికినప్పుడే అలాంటి సినిమా చేయాలి. ఇప్పుడు అటువంటి కథ కుదిరింది. 1980 నేపథ్యంలో జరిగే సినిమా ఇది. తెలుగు భాషా దినోత్సవం రోజున ఈ సినిమా వివరాలు ప్రకటించడం ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు వైవీఎస్ చౌదరి. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు నందమూరి తారక రామారావు హీరోగా, వీణా రావు హీరోయిన్‌గా నటించనున్నారు. గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా చౌదరి ఆయనకు నివాళులు అర్పించారు. చిత్ర ఎగ్జిక్యూటివ్ నిర్మాత రమేశ్ అత్తిలిని చౌదరి ఈ సందర్భంగా పరిచయం చేశారు. 'మేం నలుగురం స్నేహితులం కలసి చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టాలని అనుకున్నాం. చౌదరిగారితో కలసి ఈ ప్రాజెక్ట్ చేయడం ఆనందంగా ఉంది' అన్నారు రమేశ్ అత్తిలి. ఈ కార్యక్రమంలో నిర్మాత యలమంచిలి గీత, మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

● కమిషనర్ శేషన్న, ఆరోగ్యాధికారి హెలెన్ నిర్మల

తెనాలి, మారీసుపేట ఆగస్టు 29: పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె హెలెన్ నిర్మల కోరారు. పట్టణంలోని చినరావూరు పార్కు వద్ద గురువారం సీజనల్‌లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ, వాటికి తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు, మలేరియా, ఫైలేరియా అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వర పీడితులు దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోగాని, జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో గాని వైద్య పరీక్షలను చేయించుకొని మందులను పొందవచ్చునని తెలిపారు. అనంతరం ప్రజలకు సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మలేరియా, ఫైలేరియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పురపాలక సంఘ సాధారణ సమావేశం

తెనాలి, మారీసుపేట ఆగస్టు 29: ఈ నెల 31వ తేదీ శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గం.11 లకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఈ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

రూరల్ ఎస్‌ఐగా ప్రతాప్‌కుమార్ బాధ్యతల స్వీకారం


ప్రతాప్‌కుమార్

తెనాలి రూరల్, ఆగస్టు 29: శాంతిభద్రతల పరిరక్షణకు కఠినంగా వ్యవహరించడంతోపాటు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలుచేస్తానని రూరల్ ఎస్‌ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్‌కుమార్ చెప్పారు. గురువారం పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో తాడేపల్లి ఎస్‌ఐగా పనిచేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా తెనాలి రూరల్ స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్ ఎస్‌ఐ-2 కోటేశ్వరరావు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షణకు మొక్కలు నాటాలి: ఈదర

తెనాలి అర్బన్, ఆగస్టు 29: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటి పెంచాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం ఆధ్వర్యంలో ఐటీఐ కళాశాల ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు విద్యతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలన్నారు. మురళీకృష్ణ, ఈదర పూర్ణచంద్, కన్నెగంటి మురళి, పావులూరి రాంబాబు, జీవీ నారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు పంపిణీ

తెనాలి అర్బన్, ఆగస్టు 29: కాలుష్యాన్ని నివారించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాఠశాలలకు మొక్కలు పంపిణీ చేస్తున్నామని మార్కెటింగ్ కన్సల్‌టెంట్ లక్కరాజు సాయి చెప్పారు. సామాజిక బాధ్యతలో భాగంగా అంగలకుదురు ఉన్నత పాఠశాలకు వేప, తులసి, గులాబి మొక్కలను గురువారం అందజేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ప్రతి ఏటా పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించాలంటే వన సంరక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెనాలి రీజియన్‌లోని అన్ని స్టేట్ బ్యాంకుల పరిధిలో మొక్కలు పంపిణీ చేసి ఉన్నత పాఠశాలల ఆవరణలో నాటేందుకు బ్యాంకు అధికారులు చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, ప్రతాప్ పాల్గొన్నారు.


తెలుగు భాష ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న పాఠశాల నిర్వాహకులు

తెలుగు భాష కీర్తిని దశదిశలా చాటాలి

● శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ సయ్యద్‌బాషా

పొన్నూరు టౌన్, ఆగస్టు 29: తెలుగు భాష కీర్తిని దశ దిశలా చాటాలని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ సయ్యద్‌బాషా అన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. తెలుగు తల్లి, గిడుగు వెంకట రమణమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు, కవి, సాహితీవేత్త మండె సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సయ్యిద్ బాషా మాట్లాడుతూ తెలుగుభాషా కౌశల్యం ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. మాతృభాష తెలుగులో ఉన్న మాధుర్యంను తెలుసుకుని తెలుగు భాషాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. తెలుగుభాష గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల డీం సోమశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చవితిని భక్తిప్రపత్తులతో నిర్వహించుకోండి


చవితి విగ్రహాల ఏర్పాటు నిబంధనలపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

● ప్రైవేట్ డాన్సులకు అనుమతులు లేవు
● నిబంధనల ప్రకారం విగ్రహాలు ఏర్పాటు చేసుకోండి
● ట్రాఫిక్ ఇతర సమస్యలకు కారకులు కావద్దు
● రూరల్ సీఐ బెల్లం శ్రీనివాస్

తెనాలి రూరల్, ఆగస్టు 29: వినాయక చవితి వేడులకను భక్తి ప్రపత్తులతో నిర్వహించుకోవాలని రూరల్ సీఐ బెల్లం శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని కొలకలూరులో వినాయక చవితి వేడుకలకు విగ్రహాలను ఏర్పాటుచేసే కమిటీ సభ్యులతో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు ప్రతాప్‌కుమార్, కోటేశ్వరరావులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాక చవితి ఉత్సవాలకు విగ్రహాలను ఏర్పాటుచేసే కమిటీ సభ్యులు తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాలు కట్టే సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అదేవిధంగా మైకులు ఏర్పాటుచేసే వారు సమయపాలన పాటించాలన్నారు. విద్యుత్ దీపాలు అలంకరణపై ప్రత్యేక దృష్టిపెట్టాల, అగ్నిమాపక శాఖ నిబంధనలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. పూజా కార్యక్రమాలు ముగిసిన తరువాత నిమజ్జనానికి వెళ్లే సమయంలో ఎక్కడా కూడా కులాలను, మతాలకు, వ్యక్తులకు కించపరిచేలా డీజేలు పెట్టకూడదని భక్తి పాటలతోనే ముగించుకోవాలన్నారు. చవితి ఉత్సవాల పేరుతో ప్రైవేటు డ్యాన్స్‌లు వంటివి నిర్వహించకూడదన్నారు. చవితి వేడుకలు ప్రారంభం నుంచి నిమజ్జనం జరిగి ఉత్సవాలు ముగిసే వరకూ పూర్తి బాధ్యత కమిటీ సభ్యులదేనని తెలిపారు. ఎవరైనా నిబంధనలను పాటించకుంటే చట్ట ప్రకారం బాధ్యులవుతారని సీఐ హెచ్చరించారు. రూరల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు వినాయక విగ్రహాలు సిద్ధం

● ఇప్పటికే ప్రారంభమైన కొనుగోళ్లు

తెనాలి రూరల్, ఆగస్టు 29: వినాయక చవితి వేడుకలకు గణనాథులు మట్టి విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. తెనాలి పరిసర ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలు ప్రతి ఏటా ఆయా కమిటీలు వైభవంగా నిర్వహిస్తారు. పర్యావరణాన్ని కాపాడుకునేలా పండుగ జరుపుకోవాలని ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు మట్టితో విగ్రహాలను తయారుచేస్తున్నారు. సెప్టెంబరు 7న జరిగే వినాయక చవితికి తెనాలిలో విగ్రహాలకు మంచి డిమాండ్ ఉంది. పట్టణంలోని సుల్తానాబాద్, అంగలకుదురు ప్రధాన రోడ్డు వెంబడి విగ్రహాలను తయారీదారులు ఇప్పటికే సిద్ధం చేస్తూ కమిటీ సభ్యులకు ప్రదర్శనగా ఉంచారు. మరో 10 రోజుల్లో వినాయక చవితి రాబోతుండటంతో పరిసర గ్రామాల నుండి పెద్ద ఎత్తున ఉత్సవ కమిటీ సభ్యులు పట్టణానికి వచ్చి తయారీదారుల వద్ద రూపుదిద్దుకున్న విగ్రహాలను తిలకించి విగ్రహాలను అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్నారు. అయితే గతంలో రూ.10వేలు పలికిన విగ్రహాలు ఈ ఏడాది సైజులు వారి రూ.3వేలు వంతున పెరిగాయి. దీనికి ముడిసరుకు పెరగడమే ప్రధాన కారణమని తయారీదారులు చెబుతున్నారు. కమిటీ సభ్యులు మాత్రం ఎక్కడా కూడా ధరల విషయంలో రాజీ పడటం లేదు. సంవత్సరానికి ఒక మారు వచ్చే వినాయక చవితి వేడుకలను తమ గ్రామాల్లో వైభోపేతంగా జరిపేందుకే ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నారు. తెనాలిలో వివిధ కమిటీలు హైదరాబాద్ వంటి మహా నగరాల నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి ఇక్కడ పూజించేందుకు ఇప్పటికే బుకింగ్ చేసుకున్నారు. చవితి వేడుకలు సమీపిస్తుండటంతో ఆయా కమిటీ సభ్యులు విగ్రహాలను బుక్ చేసుకుని అందుకు అనుగుణంగా మండపాలు, డెకరేషన్ పనులతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.


వివిధ అలంకారాల్లో రూపుదిద్దుకున్న వినాయకస్వామి విగ్రహాలు

తెనాలిలో ఫ్లెక్సీల తొలగింపు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 29: పట్టణంలో ప్రభుత్వ స్థలాలలో పురపాలక సంఘ అనుమతులు లేని ఫ్లెక్సీలను, బ్యానర్‌లను మున్సిపల్ అధికారులు తొలగించారు. స్థానిక సుల్తానాబాదులో గురువారం పురపాలక సంఘ అసిస్టెంట్ సిటీప్లానర్ సుధాకర్ పర్యవేక్షణలో పురపాలక సంఘ అనుమతులు లేని రోడ్డు డివైడర్‌పై ఉన్న ఫ్లెక్సీలను, బ్యానర్‌లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో ప్రభుత్వ స్థలాలలోని ఫ్లెక్సీలను, బ్యానర్‌లను తొలగిస్తున్నామన్నారు.

తెలుగు భాషకు గిడుగు సేవలు నిరుపమానం

● ప్రజానాట్య మండలి కళాకారుడు భాస్కర్ నాని

తెనాలి అర్బన్, ఆగస్టు 29: తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి సేవలు నిరుపమానమని ప్రజానాట్య మండలి కళాకారుడు భాస్కర్ నాని చెప్పారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఆంగ్లం మోజులో పడి మాతృభాషను మరచిపోవద్దని కోరారు. నటుడు గాయకుడు బెల్లంకొండ వెంకట్ మాట్లాడుతూ తెలుగు భాషను సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. బొల్లిముంత కృష్ణ, విజయలక్ష్మి, రఘునాధరావు పాల్గొన్నారు. నాజరుపేట లూథరన్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం ప్రియదర్శిని, ఆళ్ళ నాగేశ్వరరావు, నాగలక్ష్మి, శశికళ, విజయసారధి పాల్గొన్నారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన తెలుగు బాషా దినోత్సవంలో సాయి లక్కరాజు, హెచ్‌ఎం మౌలాబీ, కల్యాణి, రవీంద్ర పాల్గొన్నారు. తెలుగు బాషా ఉపాధ్యాయిని కోడెల శ్రీపద్మను సన్మానించారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, కళ్యాణ్‌కుమార్, నాంచారయ్య, రాజ్యలక్ష్మి, తెలుగు బాషా ప్రాముఖ్యంపై ప్రసగించారు.

● తెనాలి అర్బన్: తెలుగు బాషను భావితరాలకు వారసత్వంగా అందించాలని ప్రియదర్శిని కళాశాల అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు చెప్పారు. కొత్తపేటలోని కళాశాలలో గురువారం తెలుగు బాష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ చింతల శ్రీనివాసరావు, శివరామకృష్ణ, బాలకృష్ణ, అపర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకులు కళ్యాణ్‌కమార్‌ను సన్మానించారు.


ఆటో బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు

తెనాలి రూరల్ ఆగస్టు 29: ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీ కొన్న ఘటపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని పెదరావూరు సమీపంలో బుధవారం రాత్రి వేమూరు నుంచి తెనాలి వస్తున్న ఆటో, తెనాలి నుంచి వేమూరు వెళుతున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురుకి, ద్విచక్రవాహనదారుడికి గాయాలయ్యాయి. తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్నారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


కంచెర్లపాలెంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ సుబ్బారావు

జ్వరంపై నిర్లక్ష్యం వద్దు: డాక్టర్ సుబ్బారావు

తెనాలి రూరల్ ఆగస్టు 29: జ్వరం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడేవారు నిర్లక్ష్యం చేయవద్దని దగ్గరలోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని కొలకలూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సుబ్బారావు అన్నారు. గురువారం మండలంలోని కంచెర్లపాలెంలో వైద్యశిబిరం నిర్వహించారు. పలువురు జ్వరపీడితులకు రక్తపరీక్షలు జరిపి తగిన మందులు అందించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలను, వేడి వేడి ఆహారం తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతలు పాటించాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నాగదివ్యను సన్మానిస్తున్న అధ్యాపకులు

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

● క్రీడాకారిణి నాగ దివ్య

తెనాలి అర్బన్, ఆగస్టు 29: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, తద్వారా మంచి ఉపాధి అవకాశాలు అందుకుంటున్నారని క్రీడాకారిణి నాగదివ్య చెప్పారు. జేఎంజే మహిళా కళాశాలలో కామన్ వెల్త్ క్రీడల్లో పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించిన ఆమెను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థితికి చేరడానికి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ప్రణాళిక ప్రకారం పనిచేసి సాధించాలన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జరిగిన క్రీడా దినోత్సవంలో క్రీడల్లో ప్రతిభ చూపే విద్యార్థులను సత్కరించారు. ప్రిన్సిపాల్ షైనీ, మేరీ శారద, అరుణ సుజాత పాల్గొన్నారు.

దేశంలోని క్రీడాకారులందరికీ ధ్యాన్‌చంద్ స్ఫూర్తి

తెనాలి అర్బన్, ఆగస్టు 29: దేశంలోని క్రీడాకారులందరికీ క్రీడా మాంత్రికుడు ధ్యాన్‌చంద్ స్ఫూర్తి కావాలని నెహ్రూనికేతన్ స్కూల్ ఎండీ మురళీకాంత్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని స్కూల్‌లో గురువారం ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సమ్యలను ఎదుర్కొనేందుకు అవసరమైన మానసిక ధైర్యం క్రీడలద్వారా చేకూరుతుందన్నారు. దేశానికి పతకాలు తెచ్చే విధంగా క్రీడాకారులు తమ ప్రతిభ మెరుగుపర్చుకోవాలన్నారు. విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న క్రీడల పోటీలకు బృందాలను ఎంపిక చేశారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా మహాలక్ష్మీపతి రావు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 29: పురపాలక సంఘ నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా వి.మహాలక్ష్మీపతిరావు బాధ్యతలు స్వీకరించనున్నారు. గురువారం పురపాలక సంఘ అధికారుల సాధారణ బదిలీలో భాగంగా పట్టణ పురపాలక సంఘంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కె అనూష పదోన్నతిపై కందుకురు మున్సిపల్ కమిషనర్‌గా వెళ్లారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్ మహాలక్ష్మీపతిరావును అసిస్టెంట్ కమిషనర్‌గా రానున్నారు.

నారాకోడూరు హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం


స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును ఏడుకొండలకు అందచేస్తున్న డీఈవో శైలజ తదితరులు

చేబ్రోలు, ఆగస్టు 29: క్రీడలలో ప్రథమ స్థానంలో నిలుస్తున్న నారాకోడూరు పాఠశాల అన్ని పాఠశాలలకు ఆదర్శమని డీఈవో పి.శైలజ అన్నారు. నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు గురువారం స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డును డీఈవో శైలజ అందచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలను ఘనంగా సత్కరించి అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా డీఈవో శైలజ మాట్లాడుతూ నారాకోడూరు పాఠశాల క్రీడాకారులు పాఠశాల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు రాణిస్తున్నారన్నారు. హ్యాండ్ బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో 22మంది క్రీడాకారులు రాణించారన్నారు. ఏడుగురు క్రీడాకారులకు గోల్డ్ మెడలు, నలుగురు బ్రాంజ్ మెడలు సాధించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిల్చినట్లు చెప్పారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు, వ్యాయామ ఉపాధ్యాయులు బి వెంకటేశ్వర్లు, ఎం ఉమామహేశ్వరిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మొహ్మద్ బాష, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎం రవి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ: ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, ఆగస్టు 29: ప్రతి నెల 1వ తేదీన పేదల సేవలో కార్యక్రమం కింద పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఈ నెల 31వ తేదీన పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీన ఆదివారం కావడంతో ఆ రోజున ఉద్యోగులకు సెలవు కావడంతో ఆగస్టు 31న పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా 31వ తేదీన పెన్షన్‌ను తీసుకోకపోతే సెప్టెంబరు 2వ తేదీన అందరికీ పింఛనును పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వివా, వీవీఐటీలో ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం

పెదకాకాని, ఆగస్టు 28: హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని వివా, వీవీఐటీ సంస్థలలో ఘనంగా గురువారం నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు, క్రాస్‌కంట్రీ రన్నింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వివా విద్యార్థులు క్రీడాకారుల చిత్రపటాలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వీవీఐటీ ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం క్రీడలలో పాల్గొని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. క్రీడలు జీవితంలో ఎంతో విలువైనవని, జీవితాన్నిమార్చే శక్తి క్రీడలకు ఉందన్నారు. క్రీడలవలన గ్రాహకశక్తి, జ్ఞాపకశక్తి, సహనం పెరుగుతుందని తద్వారా చదువు చక్కగా సాగుతుందన్నారు.

దశావతార వెంకటేశ్వరుని సన్నిధిలో ప్రత్యేక పూజలు.

పెదకాకాని, ఆగస్టు 29: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. గురువారం శ్రావణ మాసం సందర్భముగా దశావతార వేంకటేశ్వర స్వామి వారి ఆలయ అర్చక స్వాములు, సిబ్బంది దశావతార వేంకటేశ్వర దేవస్థానంలోని మహాలక్ష్మీ అమ్మవారికి శ్రావణ పట్టీ సమర్పించారు.

ప్రారంభమైన ప్రతిష్ఠ మహోత్సవాలు

పొన్నూరు టౌన్, ఆగస్టు 29: మండల పరిధిలోని కసుకర్రులోని సీతరామస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం గణేషపూజ నిర్వహించారు. గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖలో పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రమేష్‌బాబు బాధ్యతల స్వీకారం

పొన్నూరు టౌన్, ఆగస్టు 29: పొన్నూరు పురపాలక సంఘం కమిషనర్‌గా ముప్పాళ రమేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రమేష్ బాబు శ్రీకాళహస్తి నుంచి బదిలీపై పొన్నూరు వచ్చారు. పొన్నూరు కమిషనర్‌గా పనిచేస్తున్న సీఎంఏ నయాంఅహ్మద్ మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబును కార్యాలయ అధికారులు, సిబ్బంది కలిసి అభినందించారు.

జనగణనతో పాటే కులగణన చేపట్టాలి

● బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి అర్బన్, ఆగస్టు 29: జనగణనతో పాటు కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో బీసీల సమస్యలను ఆలకించేందుకు గాను కులాలవారీగా లెక్కలను తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనాదిగా బీసీలు దోపిడీకి గురవుతూ ఉన్నారని, మండల కమిషన్ సిఫార్సుల మేరకు దేశంలో 3743 కులాలు ఉన్నాయని, జనాభాలో వీరిశాతం 52శాతంగా ఉందని చెప్పారు. విద్యా ఉద్యోగాల్లో 27శాతం రిజర్వేషన్లను కమిషన్ సిఫార్సుల మేరకు ఆనాటి ప్రధాని అమలు చేయడంతో బీసీల అభివృద్ధికి పునాది పడిందన్నారు. బీసీల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలంటే సమగ్ర కులగణన తప్పదని చెప్పారు. సుప్రీం కోర్టు డివిజన్ బెంచ్ ఇటీవల దేశంలోని ఉప కులాలకు సామాజిక న్యాయం జరిగేలా రిజర్వేషన్ విభజించాలని చెప్పిందన్నారు. ప్రభుత్వం ఇందుకోసం అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

తెలుగు భాషలో కోర్టు తీర్పు

తెనాలి క్రైం, ఆగస్టు 29: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెనాలి న్యాయస్థానంలో ఓ న్యాయాధికారి తన కోర్టు తీర్పును తెలుగు భాషలో వెలువరించి తన భాషాభిమానాన్ని చాటుకున్నారు. తెనాలి న్యాయస్థానంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా ఉన్న (జూనియర్ డివిజన్)పవన్‌కుమార్ గురువారం ఓ కేసులో తీర్పును పూర్తిగా తెలుగు భాషలో కక్షి దారులకు అర్థమయ్యే రీతిలో తీర్పును వెలువరించి నూతన ఒరవడికి నాంది పలికారు. సాధారణంగా కోర్టుల్లో న్యాయమూర్తులు, న్యాయాధికారులు ఇంగ్లీష్ భాషలోనే తమ తీర్పును వెలువరించడం బ్రిటీష్ పాలనా కాలం నుంచి కొనసాగుతోంది. న్యాయాధికారులు వెలువరించిన తీర్పులను తిరిగి న్యాయవాదులు తెలుగులో కక్షిదారులకు వివరిస్తే గాని వారికి అర్థం కాదు. న్యాయాధికారి పవన్‌కుమార్ తెలుగుభాషలో ఇచ్చిన తీర్పును కక్షిదారులు అర్థం చేసుకుని తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ విధానం భవిష్యత్‌లో కూడా కొనసాగితే అటు తెలుగు భాషకు కక్షిదారులకు మేలు జరుగుతుందని పలువురు భావిస్తున్నారు.


కొలకలూరులో రికార్డులను పరిశీలిస్తున్న టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్

బీసీజీ వ్యాక్సిన్‌పై అపోహలు వద్దు

● స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్

తెనాలి రూరల్, ఆగస్టు 29: రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి బీసీజీ వ్యాక్సిన్ అందిస్తే ఆ వ్యక్తులు ప్రాణాంతకమైన టీబీ వ్యాధి బారిన పడకుండా ఉంటారని ప్రతిఒక్కరూ అపోహలను విడిచి వ్యాక్సిన్ వేయించుకోవాలని స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. గురువారం మండలంలోని కొలకలూరు పీహెచ్‌సీలో బీసీజీ వ్యాక్సినేషన్ అందిస్తున్న తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకూ ఎంతమందికి వ్యాక్సిన్ అందించారన్న వివరాల రికార్డులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్‌పై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయని వ్యాక్సిన్ సురక్షితమైనదన్నారు. షుగర్, ధూమపానం, మద్యపానం వంటివి చేసే వారిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల వారికి అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా వారిలో శక్తిపెరిగి వాటి బారినపడే అవకాశం ఉండదన్నారు. వ్యాక్సిన్‌ను ప్రతి సచివాలయాల్లో, పీహెచ్‌సీ సెంటర్లలో పూర్తి ఉచితంగా అందిస్తారని గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం


రథంపై కొలువుతీరిన స్వర్ణ వెంకటేశ్వర స్వామి

పొన్నూరు టౌన్, ఆగస్టు 29: పట్టణంలోని స్వర్ణ వెంకటేశ్వరస్వామి వెంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలో భాగంగా గురువారం స్వామివారి గరుడోత్సవం, రథోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. బ్రహోత్సవాల్లో భాగంగా కల్యాణక్రతువు పూర్తి చేసుకున్న స్వామివార్ల ఉత్సవ మూర్తులను ఉదయం గరుడ వాహనంపై ప్రతిష్ఠించి నగరోత్సవం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ స్వర్ణ వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయినటువంటి విశాఖపట్నం జిల్లా, భీమిలి మండలం, తగరపువలస పట్టణం, చిట్టివలస పోస్ట్, చిల్లపేట, బొగ్గు రోడ్డు, సుఖీభవ కాలనీ, సరస్వతి కుటీర్, ప్లాట్ నెం. 202రు కాపురస్తులు తాళ్ళూరి రాజేంద్రప్రసాద్ గారి కుమారుడు తాళ్ళూరి రామకృష్ణ గారి ద్వారా సంజాయిషి పొంది తెలియచేయునది ఏమనగా..

నా క్లయింటు అయిన తాళ్ళూరి రామకృష్ణ గారికి దిగువ షెడ్యూలు ఆస్తులు తన తండ్రి తాళ్ళూరి రాజేంద్రప్రసాద్ గారు ది. 07-01-2015న కొల్లిపర సబ్ రిజిష్టారు ఆఫీసు నందు 3వ పుస్తకం ద.నెం.2/2015రుగా రిజిష్టరు చేయించిన వీలునామా ద్వారా సంక్రమించి నా క్లయింటు అయిన తాళ్ళూరి రామకృష్ణ సమస్త సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించుచున్న ఆస్తులని తెలియజేసియున్నారు. సదరు ఆస్తులను తాళ్ళూరి రామకృష్ణ గారి పేరిటకు ఆన్‌లైన్ చేయు నిమిత్తము ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరములు గాని ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి 7 దినములలో అభ్యంతరములను ఈ నెంబర్లకు తెలియజేయగలరు. లేనియెడల ఏకపక్షంగా నా క్లయింటు తాళ్ళూరి రామకృష్ణ పేరున యీ దిగువ షెడ్యూలు ఆస్తులు ఆన్‌లైన్ చేయబడును. 1) యేమినేని రమేష్, అడ్వకేట్, సెల్: 98488 78221, 2) తాహశీల్దార్, తెనాలి, సెల్: 98499 04023

షెడ్యూలు: 1) గుంటూరు డి, దుగ్గిరాల సబ్‌డి యిలాకా కొలకలూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన కొలకలూరు గ్రామ డి.నెం. 1082/6రు య. 1-01 శెంట్లు పూరా కొలత ప్రకారం తేలిన య. 1-03 శెంట్లుకు హద్దులు: **తూర్పు:** 3వ అయిటం భూమి కొంత వరకు, అర్వపల్లి నాగేంద్రమ్మ గారి భూమి కొంతవరకు, షేక్ మస్తాన్ గారి భూమి కొంతవరకు హద్దు; **దక్షిణం:** పంట కాలువ హద్దు; **పడమర:** 1వ అయిటం భూమి హద్దు; **ఉత్తరం:** తాళ్ళూరు సుబ్బారావు వగైరాల భూమి హద్దు; యీ హద్దుల మధ్య య. 1-03 ట్లు లేక చ.మీ. 4168-27ర్లు శేరీ మాగాణి భూమిన్ని.

2) గుంటూరు డి, దుగ్గిరాల సబ్‌డి ఇలాకా కొలకలూరు గ్రామ పంచాయితి ఏరియాలో చేరిన కొలకలూరు గ్రామ డి.నెం. 1081/1రు య. 3-33 ట్లు మింజుమలె హద్దులు. **తూర్పు:** 4వ అయిటం భూమి హద్దు; **దక్షిణం:** అర్వపల్లి నాగేంద్రమ్మ గారి భూమి హద్దు; **పడమర:** 2వ అయిటం భూమి హద్దు; **ఉత్తరం:** తాళ్ళూరు వెంకటేశ్వర్‌రావు గారి భూమి హద్దు; యీ హద్దుల మధ్య య. 0-74 ట్లు లేక చ.మీ. 2994-68ర్లు శేరీ మగాణి భూమిన్ని.

3) గుంటూరు డి, దుగ్గిరాల సబ్ డి యిలాకా కొలకలూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన కొలకలూరు గ్రామ డి.నెం. 1081/1రు య.3-33ట్లు మింజుమలె హద్దులు: **తూర్పు:** సర్కారు డొంక హద్దు; **దక్షిణం:** అర్వపల్లి నాగేంద్రమ్మ గారి భూమి హద్దు; **పడమర:** 3వ అయిటం భూమి హద్దు; **ఉత్తరం:** తాళ్ళూరు వెంకటేశ్వరరావు గారి భూమి హద్దు. యీ హద్దుల మధ్య య. 0-26ట్లు లేక చ.మీ. 1052-18ర్లు శేరీ మెరక భూమి.

ఇట్లు
యేమినేని రమేష్, అడ్వకేట్, తెనాలి